

ఇండియా గేమింగ్ షో 6వ ఎడిషన్‌లో రాష్ట్ర మంత్రి మండిపల్లి రామప్రసాద్

6 లో

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :140 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 18 ఏప్రిల్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి



పార్లమెంటు సభ్యులకు ప్రధాని మోదీ పిలుపు

మహిళా రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపు

లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు

ఇది యుగాలుగా మహిళలకు నిరాకరించిన హక్కు అని, వారికి న్యాయం చేయాలని వ్యాఖ్య

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని హామీ

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ చరిత్రాత్మక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇది దేశంలోని సగం జనాభా అయిన మహిళలకు దక్కాల్సిన హక్కు అని, వారి శక్తికి కొత్త అవకాశాలు కల్పించాలని కోరారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీశక్తి వందన్ అధినియమ్' అమలు కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ బిల్లును 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా అవసరమైన రాజ్యాంగసవరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భవిష్యత్తులో జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత ఈ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "దయచేసి మీ మనస్సాక్షి చెప్పినట్లు నడుచుకోండి. మీ కుటుంబంలోని మహిళలను గుర్తుచేసుకోండి. ఇది మహిళలకు మనం ఇస్తున్నాం అనుకోకండి... యుగాలుగా వారికి నిరాకరించబడిన హక్కును తిరిగి ఇవ్వడం మన బాధ్యత అని గుర్తించండి" అని పేర్కొన్నారు. ఈబిల్లు ఆమోదం ఘనతను ప్రతిపక్షాలే తీసుకోవచ్చని, తనకు క్రెడిట్ అవసరం మిగతా 2లో...



## ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి

పోలీసులకు సమాచారం అందించిన మెట్రో సిబ్బంది

తనిఖీలు నిర్వహించగా లభ్యం కాని అనుమానాస్పద వస్తువులు

హైదరాబాద్, సింధూరదర్శిని: నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మెట్రోరైలు స్టేషన్‌లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తి ఎవరో ఆరా తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



## మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు తెలిపిన పీతల సుజాత

వివరాలు 2లో

## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్‌సిగ్నల్

-25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి

-యూకేతో పాటు యూరప్ దేశాల్లో పర్యటించనున్న జగన్

-కుటుంబంతో కలిసి 25 రోజుల పాటు విదేశీ పర్యటన

-పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు సీబీఐకి ఇవ్వాలని కోర్టు ఆదేశం



**అమరావతి, సింధూరదర్శిని:** వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో

## స్వచ్ఛాంధ్ర సాకారానికి పటిష్ట కార్యాచరణ



100 శాతం చెత్త సేకరణ, ప్రాసెసింగ్ జరగాలి

మున్సిపాలిటీల్లో కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం

పార్కులుగా గ్రామీణ, పట్టణ సరిహద్దు డంపింగ్ యార్డులు

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

స్వచ్ఛాంధ్ర ర్యాంకుల్లో విశాఖ జిల్లాకు మొదటి స్థానం... చివరన నిలిచి ఏఎస్ఆర్ జిల్లా

**అమరావతి, సింధూరదర్శిని:** స్వచ్ఛాంధ్ర సాకారం కావడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోవడంలో విఫలమైతే... కారణాలు అన్వేషించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఈ ఏడాది మార్చి 31 వరకు రూపొందించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాంకులను అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు జిల్లాలు స్వచ్ఛాంధ్రలో మొదటి మూడు స్థానాల్లో ఉండగా... శ్రీ సత్యసాయి, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలు చివరి మూడు స్థానాల్లో ఉన్నట్టు తెలిపారు. ఇందులో విశాఖ జిల్లాకు 92శాతం, విజయనగరం, గుంటూరు జిల్లాలకు 85 శాతం మార్కులు వచ్చాయి. అట్టడుగున ఉన్న ఏఎస్ఆర్ జిల్లాకు కేవలం 53 శాతం మార్కులు మాత్రమే వచ్చాయి. డోర్ టు డోర్ కలెక్షన్, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ వంటివి ర్యాంకులకు ప్రాతిపదికగా తీసుకున్నట్టు చెప్పారు.. అయితే ఇకపై జిల్లాలకు స్వచ్ఛాంధ్ర ర్యాంకులు థర్డ్ పార్టీ ఇచ్చేలా చూడాలని సీఎం సూచించారు.

**జూన్ కల్లా 100 శాతం చెత్త క్లియర్**

మున్సిపాలిటీల్లో అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే నిర్ణీత పరిధిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పేలా చూడాలన్నారు. గతంలో వ్యర్థాలతో నిండిపోయిన డంపింగ్ యార్డుల్లో ప్రస్తుతం చెత్త క్లియర్ చేయడంతో పాటు ఆయా స్థలాలను పచ్చదనంతో నింపేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణానికి సమీపంలో ఉన్న డంపింగ్ కేంద్రాలను ముందుగా పార్కులుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. 2024 జూన్ నుంచి నేటి వరకు పట్టణాల్లో 153 లక్షల టన్నుల చెత్తకు గాను, 114 లక్షల టన్నుల చెత్త మిగతా 2లో...

## ఒక్కరి ఓటు కోసం.. గుజరాత్ అడవిలో ఈసీ ప్రత్యేక పోలింగ్ బూత్

దట్టమైన గిర్ అడవుల్లోని మహదేవ్ ఆలయంలో నివసిస్తున్న మహంత్ హరిదాస్ బాపు

ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఒకే ఒక వ్యక్తి హరిదాస్ బాపు

ఒక్క ఓటు కోసం ప్రత్యేక పోలింగ్ బూత్.. సిబ్బందిని పంపుతున్న ఈసీ




**సింధూరదర్శిని:** సింహాలు, ఇతర వన్యప్రాణులు విలసిల్లుతున్న గిర్ దట్టమైన అరణ్యంలో, కేవలం ఒక్క వ్యక్తి మహంత్ హరిదాస్ బాపు జీవిస్తున్నారు. ఆయనకు ఓటు వేసే హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పూర్తిస్థాయిలో సజీవంగా ఉంచడానికి ఈసీ సిద్ధమైంది. గిర్‌గఢ్‌డా తాలూకాలోని జమ్వాలా గ్రామానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో, ఎటువంటి జనావాసం లేని ఏకాంత ప్రదేశంలో చారిత్రాత్మక బనేజ్ మహాదేవ్ ఆలయం ఉంది. ఇక్కడ మిగతా 2లో...

## వీగిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు... బీజేపీపై కవిత తీవ్ర ఆగ్రహం



ప్రతిపక్షాలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తాయని బీజేపీకి తెలుసన్నకవిత

తమకు సంఖ్యాబలం లేకపోయినా బీజేపీ హడావుడిగా బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శ

బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు

మహిళ నాయకత్వం వహిస్తున్న పశ్చిమ బెంగాల్ నుంచి ప్రారంభించాలని పిలుపు

**హైదరాబాద్, సింధూరదర్శిని:** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఈ మేరకు ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. బీజేపీ దేశ ప్రజలను మరోసారి మోసం చేసిందని కవిత మండిపడ్డారు. అన్నీ తెలిసే బీజేపీ ఈ బిల్లును ప్రవేశపెట్టిందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజనను మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపెట్టడం వల్ల ప్రతిపక్షాలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తాయని అధికార పార్టీకి ముందే తెలుసని అన్నారు. అయినప్పటికీ ఈ బిల్లులను కలిపి తీసుకువచ్చిందని అన్నారు. తమకు మిగతా 2లో...

## వీగిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు... బీజేపీపై కవిత తీవ్ర ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన సంఖ్యాబలం లేదని తెలిసినప్పటికీ ప్రభుత్వం ఈ బిల్లును హడావుడిగా ప్రవేశపెట్టిందని ఆరోపించారు. భారత మహిళల భావోద్వేగాలను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుందని ధ్వజమెత్తారు. మహిళలందరూ ఈ మోసాన్ని గుర్తించి, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.ఒక మహిళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, కాబట్టి బీజేపీ పతనాన్ని అక్కడి నుంచి ప్రారంభించాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని దీని ద్వారా నిరూపితమైందని అన్నారు. బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆడబిడ్డలు కూడా బీజేపీ చేసిన మోసాన్ని గుర్తించాలని అన్నారు. బెంగాల్‌లోని మీ స్నేహితులు, సన్నిహితులకు మమతా బెనర్జీకి ఓటు వేసి గెలిపించాలని చెప్పాలని కోరారు.

## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.

అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

## ఒక్కరి ఓటు కోసం.. గుజరాత్ అడవిలో ఈసీ ప్రత్యేక పోలింగ్ బూత్

(మొదటిపేజీ తరువాయి)

నివసించేది మహంత్ హరిదాస్‌బాపు ఒక్కరే కావడంతో ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.ఇక్కడ ఉన్న ఒకే ఒక్క ఓటరు కోసం అధికారులు, సిబ్బందిని 20 కిలోమీటర్ల దూరంలోని మారుమూల ప్రాంతానికి ఈసీ పంపుతోంది. ఇందులో భాగంగా ప్రిసైడింగ్ అధికారి, సిబ్బంది, పోలీసు సిబ్బంది పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే అటవీ ప్రాంతానికి చేరుకుని రాత్రంతా అక్కడే ఉంటారు. మహంత్ హరిదాస్ బాపు ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాత వీరంతా తిరుగు ప్రయాణమవుతారు. కాగా, గుజరాత్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 26న జరగనుండగా, ఏప్రిల్ 28న ఓట్లను లెక్కిస్తారు.

## మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి

(మొదటిపేజీ తరువాయి)

లేదని స్పష్టంచేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రస్తుతం లోక్‌సభలో ఈ బిల్లులపై చర్చ కొనసాగుతుండగా, శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందితే దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని పేర్కొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు తెలిపిన పీతల సుజాత



న్యూఢిల్లీ: చరిత్రాత్మకమైన మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు తెలుపుతూ టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి పీతల సుజాత ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్లమెంట్ ఆవరణలో కేంద్రమంత్రులు, జాతీయ నాయకులతో కలిసి మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో నారీశక్తి దేశ అభివృద్ధి లో కీలక పాత్ర పోషించనుందని ఆమె పేర్కొన్నారు. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చిన ప్రధానినరేంద్రమోదీ, టీడీపీజాతీయఅధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యాటకాభివృద్ధికి అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు శ్రీకారం

బాపట్ల, సింధూరదర్శిని:పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా జిల్లాలో అడ్వెంచర్ స్పోర్ట్స్‌ను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. చీరాల బీచ్‌లో రెండు, పాండురంగాపురం వద్ద రెండు, సూర్యలంక బీచ్‌లో రెండు యూనిట్లు ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జెట్టీలు, బీచ్ షాక్స్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ సంయుక్త కలెక్టర్, డీఆర్‌ఓ జి. గంగాధర్ గౌడ్, ఆర్డీఓలు గ్లోరియా, చంద్రశేఖర్, శ్రీదేవి, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛాంధ్ర సాకారానికి పటిష్ట కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)

తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ జూన్ కల్లా 100 శాతం క్లియర్ చేయాలని సీఎం ఆదేశించారు. గ్రామాల్లో పేరుకు పోయిన 10 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఇంటింటికీ చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ కూడా 100 శాతం జరగాలన్నారు. కంపోస్ట్ మార్కెటింగ్ చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు సమన్వయ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. మ్యాజిక్ డ్రెయిన్లకు అనుసంధానంగా కమ్యూనిటీ సోక్ పిట్స్ తీసుకురావడం ద్వారా మురుగునీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహద పడుతుందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, నెట్ జీరో, గ్రీనరీ పెంపు, క్లీన్-హైజీన్ కిచెన్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. గాలి నాణ్యత పర్యవేక్షణకు ప్రస్తుతమున్న 83 ప్రాంతాలతో పాటు, అదనంగా 53 మాన్యువల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

**డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు, ఈ వేస్ట్ కలెక్షన్‌కు సంబంధించి అమలు చేస్తున్న విధానాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నామని, గోబర్ ధన్ యూనిట్లు, గ్రీన్ షాప్స్ ద్వారా చెత్తను ఆదాయంగా మారుస్తున్నామని అధికారులు తెలిపారు. మురుగు నీటి నిర్వహణలో కూడా సమూల మార్పులు తెస్తున్నామని... గ్రే వాటర్, బ్లాక్ వాటర్ నిర్వహణకు భారీ ప్రాజెక్టులు చేపట్టినట్టు వివరించారు. పొడి చెత్తను సేకరించే గ్రీన్ షాపులకు స్వచ్ఛ రథం ఏజెన్సీ నుంచి, పంచాయతీ నుంచి సాయం అందించేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం అవుతాయని వెల్లడించారు. అలాగే 'స్వచ్ఛ పథం' పేరుతో గ్రామీణ రోడ్ల శుభ్రత కోసం ప్రత్యేక వాహనాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

**590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు**

10 జిల్లాల్లో 590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. పట్టణాల్లో 2024-2026 మధ్య గ్రీన్ స్పేస్ పార్కులు 57 అభివృద్ధి చేసినట్టు వివరించారు. మరో 284 గ్రీన్ స్పేస్ పార్కులు, 100 స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని అధికారులు తెలపగా, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

గ్రామాల్లో మురుగునీటి నిర్వహణకు సోక్ పిట్స్, కిచెన్ గార్డెన్స్, మ్యాజిక్ డ్రెయిన్స్ వంటి విధానాలు అవలంభిస్తున్నామని, ఈ ఏడాది డిసెంబర్ కల్లా... 7.14 లక్షల కిచెన్ గార్డెన్స్, 1 లక్ష సోక్ పిట్స్, 8,000 కమ్యూనిటీ సోక్ పిట్స్, 100 కి.మీ. మ్యాజిక్ డ్రైన్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా నిలపాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతంగా ఉన్న గ్రీన్ కవర్‌ను... 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమీక్షలో మంత్రి నారాయణ, పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఎంఏయూడీ కమిషనర్ సంపత్ కుమార్, పంచాయతీరాజ్ శాక డైరెక్టర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో గృహా వినియోగ ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు, సరఫరా కొనసాగుతోంది

**వాణిజ్య ఎల్పీజీ సరఫరా ప్రాధాన్యతల ఆధారంగా 70% నుంచి 80% కొనసాగుతోంది**

**జీఎమ్ & ఓఎమ్‌సీ స్టేట్ లెవెల్ కో-ఆర్డినేటర్ ఎన్.భాస్కర్ రెడ్డి**




విజయవాడ, సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గృహ వినియోగ ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, భయాందోళనలతో చేస్తున్న భారీ బుకింగ్స్ వల్ల డెలివరీలో కొన్ని చోట్ల కాస్త ఆలస్యం అవుతుందని శ్రీ ఎన్.భాస్కర్‌రెడ్డి, జీఎమ్ & ఓఎమ్‌సీ స్టేట్ లెవెల్ కోఆర్డినేటర్ వెల్లడించారు. విజయవాడ - పత్రికా సమా చార కార్యాలయంలో రాష్ట్రస్థాయి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరా, ఇంధన నిల్వలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రజల్లో పెరిగిపోయిన భయాందోళనలతో అంతకు ముందు కంటే బుకింగ్స్ సంఖ్య భారీగా పెరిగిపోయిందని, దీంతో వాణిజ్య సరఫరాలో కొంత మేరకు కోత విధించి గృహ అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం.. గృహ వినియోగ ఎల్పీజీ సరఫరా 100శాతం కొనసాగు తుండగా.. వాణిజ్య ఎల్పీజీ సరఫరా మాత్రం గత వినియోగంలో 70%-80% వరకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆసుపత్రులు, విద్యా సంస్థలు, క్యాంటిన్లు, ప్రముఖ ఆలయాలకు మాత్రం పూర్తి స్థాయిలో, ఏటువంటి అంతరాయాలు లేకుండా వాణిజ్య ఎల్పీజీ సరఫరాను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున రోజుకు 17,652 వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లు పంపిణీ అవున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు ఎప్పటిలానే నిర్వహిస్తున్నామని.. సరఫరా, పంపిణీలో ఎక్కడా కొరత లేదన్నారు. కనీసం మూడు రోజులకు సరపడా నిల్వలు నిరంతరం అందుబాటులో ఉన్నట్లుగా వెల్లడించారు. భయాందోళనలతో చేస్తున్న బుకింగ్స్ పెరగడం వల్ల కొన్ని చోట్ల డెలివరీలు ఆలస్యమవుతన్నాయి తప్పా.. గ్యాస్ కొరత లేదని వివరించారు. ఎక్కడైనా సరఫరాల్లో అంతరాలుంటే వాటిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ.. వినియోగదారులు ఇబ్బందులు పడకుండా సరఫరా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వలస కార్మికుల్ని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ల పంపిణీలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మీడియాకు భాస్కర్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు 840 నుంచి 850 వరకు 5 కేజీల సిలిండర్లను పంపిణీ చేస్తున్నట్లుగా తెలియజేశారు. వలస కార్మికులెవరైనా.. సరైన పత్రాలు చూపించి ఈ సిలిండర్లను డీలర్ల వద్ద నుంచి పొందవచ్చని తెలిపారు. అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ మార్పుల వల్ల భవిష్యత్తులో సంభవించే ఇలాంటి ఇంధన, గ్యాస్ సంక్షోభాలను ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్పీజీకి ప్రత్యమ్నాయంగా పైప్డ్ న్యాచురల్ గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో మౌలిక వసతులున్న చోట్ల ప్రజలు, వాణిజ్య సంస్థలు పీఎన్జీ కనెక్షన్ల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం.. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ.. రాష్ట్ర ప్రభుత్వాలు, ఓఎంసీ, ప్రైవేట్ సంస్థల సమన్వయంతో పని చేస్తోందని వివరించారు. పీఎన్జీ ధర ఎల్పీజీ కన్నా తక్కువని, మన దగ్గర కృష్ణా-గోదావరి బేసిన్ లోనూ సహజ వాయువు క్షేత్రాలు అందుబాటులో ఉండడంతో మౌలిక సదుపాయాల కల్పనకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో 15 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలున్నాయని తెలిపిన అధికారులు.. ఆయిల్ రీఫైనరీల దగ్గర సరిపడినంత ముడి చమురు నిల్వలున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చర్యలతో ఇంధన, గ్యాస్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతు న్నట్లు వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఏ రిటైల్ అవుట్ లెట్ లోనూ ఇంధన కొరత ఉన్నట్లుగా కేసులు నమోదవ్వలేదని వెల్లడించారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, భయాందోళనలతో బుకింగ్స్ చేయవద్దని కోరారు.ఈ సమావేశంలో జీ.సురేష్ కుమార్, ఐఐఎస్, డైరెక్టర్, పిఐబి విజయవాడ; భాస్కర రావు, డివిజనల్ హెడ్ - ఎల్పీజీ సేల్స్ పాల్గొన్నారు.

# వాణిజ్య పన్నులు నూరు శాతం వసూలు చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



బాపట్ల, సింధూరదర్శిని: జిల్లాలో వాణిజ్య పన్నులు నూరు శాతం వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. వాణిజ్య పన్నుల వార్షిక ప్రణాళికపై అనుబంధ శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చట్టబద్ధంగా పన్నుల వసూళ్లు పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి వాణిజ్య పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.116.83 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.94.22 కోట్లు మాత్రమే వసూలు కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్ష్యాలు చేరుకోలేకపోవడం సరికాదన్నారు. ప్రొఫెషనల్ పన్ను విషయంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.4.53 కోట్లు లక్ష్యం ఉండగా, కేవలం రూ.3.59 కోట్లు మాత్రమే వసూలు కావడం గమనార్హమన్నారు. బాపట్ల డివిజన్‌లో 190 మంది, చీరాల డివిజన్‌లో 174 మంది మాత్రమే ప్రొఫెషనల్ పన్ను చెల్లింపులపై నమోదు కావడం తక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో పన్నులపై అవగాహన పెంచాలని, అభివృద్ధి పనుల్లో పాల్గొనే గుత్తేదారుల నుంచి చట్టబద్ధంగా పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే నిర్మాణ పనులపైనా కచ్చితంగా పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధిత శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు, వాణిజ్య సంస్థల నుంచి లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలని అన్నారు. పన్నులు చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రక్కును సీజ్ చేసిన విషయాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ ఘటనపై స్పందించిన కలెక్టర్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వాణిజ్య పన్నుల శాఖ అధికారి గ్లోరి, డీపీఓ ప్రభాకర్, ఎల్‌డీఎం శివకృష్ణ, ఆర్డీవోలు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా పెంచలకోన బ్రహ్మోత్సవాలు

**దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం - సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ దర్శన ఏర్పాట్లు**

**అధికారులందరూ సమర్థవంతంగా పనిచేయాలి - బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఫెస్టివల్ కమిటీని నియమించాం**

**సభ్యులందరూ బాధ్యతగా భక్తులకు సేవ చేయాలి - త్వరలోనే రాష్ట్ర పండుగగా పెంచలకోన బ్రహ్మోత్సవాలను ప్రకటిస్తాం**

**ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం - రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



రాపూరు( సింధూరదర్శిని) 17 ఏప్రిల్ నెల్లూరు జిల్లా; పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు.శుక్రవారం వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ తో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 27వ తేదీ నుంచి మే 3వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల కోసం అన్ని శాఖలు ముందుగానే సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం ప్రశాంతంగా జరిగేలా క్యూలైన్లు, బారికేడింగ్, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్త్రీ శక్తి పథకం వల్ల మహిళా భక్తుల సంఖ్య పెరిగే అవకాశమున్నందున ఆర్టీసీ అధికారులు అధిక సంఖ్యలో బస్సులు నడపాలని ఆదేశించారు. విద్యుత్, పోలీస్, ఫైర్, మెడికల్, ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీ శాఖల అధికారులు భక్తుల అవసరాల మేరకు అన్ని సదుపాయాలు కల్పించాలని, అగ్నిమాపక వాహనాలు, 108 అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నదానం సౌకర్యాలు కల్పించడంతో పాటు నిరంతర వైద్య సేవల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హనుమంతుని సేవ, గరుడ సేవ, కళ్యాణ ఉత్సవం రోజుల్లో భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కాణిపాకం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, మాలకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 832 కోట్లు మంజూరు చేసినట్లు, టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ. 750 కోట్లతో ఐదువేలకుపైగా భజన మందిరాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఈనెల 16 న రాష్ట్ర సచివాలయంలో సుమారు మూడు గంటలకు పైగా దేవాదాయ శాఖపై సీఎం సమీక్షించి ఆలయాల అభివృద్ధికి కీలకమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. పెంచలకోన శ్రీఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఇటీవల రూ. 6.50 కోట్లు మంజూరు చేసినట్లు, బ్రహ్మోత్సవాల అనంతరం పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంపై కూడా ఇంజనీరింగ్ అధికారులు, ఆగమ పండితులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నడూ లేని విధంగా బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి**

వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మంత్రి సహకారంతో ఆలయ అభివృద్ధి కి కృషి చేస్తున్నామని చెప్పారు. ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంతో పాటు లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని కూడా పునర్ నిర్మించాలని కోరుతూ మంత్రి కి లేఖను అందించినట్లు చెప్పారు. సామాన్య భక్తులకు మంచి దర్శన భాగ్యం కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు.తొలుత ఆలయానికి విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యేకు వేద పండితులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.ఈ సమావేశంలో నెల్లూరు ఆర్డీవో అనూష, దేవాదాయ శాఖ ఆర్జేసి ఆజాద్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







# మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు సత్కారం

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతులమీదుగా ప్రశంస పత్రాలు**

నెల్లూరు( సింధూర దర్శిని) 17 ఏప్రిల్ నెల్లూరు జిల్లా ; స్థానిక కలెక్టర్ కార్యాలయములోని తిక్కన ప్రాంగణములో శుక్రవారం సంఘీక సంక్షేమ కాలేజి హాస్టల్ లో ఉంటూ ఉంటూ మొదటి, రెండవ సంవత్సరము ఇంటర్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణ సాదించిన పలువురు విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రసంశా పత్రాలను అందించారు. వారిలో ఆత్మకూరు బాయిస్ హాస్టల్లో ఇంటర్ ప్రదమ సంవత్సరములో (479/500) మార్కులు సాధించిన కే.గణేష్, (473/500) మార్కులు సాధించిన పి.పూజ,నెల్లూరు, మరియు బి.పుష్పలత ( 468/500) , ద్వితీయ సంవత్సరములో యస్.అనూషా (956/1000)టి.సుమతి (934/1000),పి.శ్రీ వేణు (924/1000) లను సముచిత రీతిలో ప్రసంశా పత్రంతో సముచిత రీతిలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.









# త్వరితగతిన ఫిర్యాదులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**

నెల్లూరు (సింధూర దర్శిని) 17 ఏప్రిల్ నెల్లూరు జిల్లా ; స్థానిక కలెక్టర్ కార్యాలయములోని తిక్కన ప్రాంగణములో శుక్రవారం ఉద్యోగస్తుల గ్రీవేన్సును జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన నిర్వహింహారు. ఉద్యాస్తుల నుండి వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవిన్యూ అధికారి విజయ కుమార్ లు అర్జీలను స్వీకరించారు. గత సంవత్సరం జూలై-25, 2025 సవత్సరము నుండి ప్రతి నెలా 3 వ శుక్రవారము ఉద్యోగస్తుల గ్రీవేన్సును నిర్వ హించడం జరుగుతున్నది. ఇప్పటివరకు 4 శుక్రవారాలు ఉద్యోగస్తుల గ్రీవేన్సును నిర్వహించారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఉద్యోగస్తుల గ్రీవేన్సునులో 235 పిర్యాదులు అందగా ఆందులో 172 పరిష్కారము కాగా మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. వచ్చిన పిర్యాదులను సంబంధిత అర్జీ దారునితో వివరంగా చర్చించి ఆయా శాఖల అధికారులకు అందించారు. త్వరితగతిన పిర్యాదులను పరిష్కరించి వివరాలు తెలియ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

**హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ షరీనా**



గూడూరు (సింధూర దర్శిని) 17 ఏప్రిల్ నెల్లూరు జిల్లా ; ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించుకోవాలనే గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ షరీనా సూచించారు. పట్టణంలోని డి ఆర్ డబ్ల్యు మహిళా కళాశాలలో రొటేరియన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్యత అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపర్నెంట్ షరీనా మాట్లాడుతూ ఏప్రిల్ నెలలోనే ఎండలు ఎక్కువగా ఉన్నాయని ఈ సీజన్లో ఎక్కువగా వడదెబ్బ తగులుతుందని సాధ్యమైనంతవరకు ఎండ సమయంలో బయటికి రాకుండా ఉండాలన్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, తీసుకోవాలని కూల్డ్రింక్స్ ఆరోగ్యానికి హానికరమని అన్నారు. విద్యార్థినిలు పరీక్షా సమయంలో వాటర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, రొటేరియన్ శ్యామ్‌యాదవ్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# మూలస్థానేశ్వరస్వామికి ఘనంగా అభిషేకం



గూడూరు (సింధూరదర్శిని)17 ఏప్రిల్ నెల్లూరుజిల్లా; పట్టణంలోని శ్రీ భువనేశ్వరి దేవి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి పసుపు, కుంకుమ,పాలు ,పెరుగు, పంచామృతం, తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం ఘనంగా నిర్వహించారు. భక్తుల ఓం నమశ్శివాయ నామ స్మరణ చేస్తూ అభిషేక కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# తోణుకుమాల పంచాయితీలో జల హారతి... జల ధార కార్యక్రమం

గూడూరు( సింధూరదర్శిని) 17 ఏప్రిల్ నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండల పరిధిలోని తోణుకుమాల గ్రామపంచాయతీలో శుక్రవారం జలధార... జల హారతి కార్యక్రమంలో భాగంగా పూజా కార్యక్రమం నిర్వహించి 100 రోజుల పనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు మేకల కుమార్ , సర్పంచ్ త్రివిక్రమ్ , భాస్కర్ ,ఎన్ ఆర్ జీఎస్ఏ పీ ఓ గిరి, పంచాయతీ కార్యదర్శి నాగూర్, ఉపాధి హామీ కూలీలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.






# ఎమ్మెల్యే చొరవతో యధావిధిగా గూడూరుకు రాకపోకలు

### సర్కిల్లో సిమెంటు దిమ్మలతో అడ్డుగా వేసిన రాళ్లు తొలగింపు

గూడూరు( సింధూర దర్శిని) 17 ఏప్రిల్ నెల్లూరు జిల్లా ; రోడ్డు ప్రమాదాల నివారణకై చిల్లకూరు జాతీయ రహదారి గూడూరులోకి వచ్చే మార్గాన్ని పోలీసులు నాలుగు రోజుల కిందట సిమెంటు రాళ్లతో మూసివేశారు. దీంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే సునీల్ కుమార్ కు నాయకులు తెలియజేయడంతో జిల్లా ఎస్పీతో మాట్లాడి ఎమ్మెల్యే సునీల్ కుమార్ జాతీయ రహదారిపై ఉన్న రాళ్లను తొలగించే ల చర్యలు తీసుకున్నారు. చిల్లకూరు జాతీయ రహదారి గూడూరు లో వచ్చే సర్కిల్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో అనేక మంది మృతి చెందుతున్నారు. దీంతో పోలీసులు చెన్నై,నెల్లూరు నుండి గూడూరు వైపు వచ్చే సర్కిల్ రహదారిని సిమెంటు రాళ్లతో మూసివేశారు. గూడూరు నుండి చెన్నై వెళ్లాలంటే చిల్లకూరు జాతీయ రహదారి నుండి ఆదిశంకర కాలేజీ వరకు వెళ్లి యూటర్న్ తీసుకొని వెళ్ళవలసి ఉంటుంది. నెల్లూరు నుండి వచ్చే వాహనాలు వరగలి క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లి యూటర్న్ తీసుకొని చిల్లకూరు మీదుగా గూడూరుకు వచ్చేలా పోలీసులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు నాయకులు ఎమ్మెల్యే సునీల్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్, నెల్లూరు జిల్లా ఎస్పీతో మాట్లాడి సమస్యను వివరించి మూసివేసిన రోడ్డును పురం ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే స్వయంగా జాతీయ రహదారి వద్దకు వచ్చి రాళ్ల తొలగింపును పర్యవేక్షించారు. యధావిధిగా రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకై పోలీసులు రోడ్డున మూసివేసారని అయితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల ఇబ్బందులను జిల్లా ఎస్పీకి తెలియజేశామని ఆమె వెంటనే స్పందించి రోడ్డును పునః ప్రారంభించేలా సహకరించారని ఆమెకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బారికెట్లు సిగ్నలింగ్ ఏర్పాటు చేసేలా నేషనల్ హైవే అధికారులకు తెలియజేస్తామని ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి మంజూరు అయిందని, త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వాహనాలు నడిపే వారు కూడా అతివేగంగా రావడం మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు ,బిల్లు చెంచురామయ్య, రహీం ,మస్తాన్ నాయుడు వాటం భేటీ శివకుమార్ ,వాటం భేటీ హరికుమార్ ,మునిగిరేష్ ,నల్లపరెడ్డి వినోద్ రెడ్డి ,కరుణాకర్ రెడ్డి, చంద్రమౌళి, ఓం ప్రకాష్ ,ప్రణీత్ యాదవ్ ,చంద్రా నిల్, ఇంద్రవర్ధన్ ,తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి మాదక ద్రవ్యాల రవాణా వినియోగం చట్ట రీత్యా నేరం

**విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణ పట్టుబడిన వారిపై పి డి యాక్ట్ నమోదు**

**జిల్లాలో పట్టుబడిన 4,100 కేజీల గంజాయి .. కోర్టు అనుమతితో డిస్పోజ్**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

**గంజాయి, మత్తు పదార్థాల వాడకం ద్వారా కలిగే దుష్ప్రభావం, ఆరోగ్య సమస్యల పై ప్రజలకు అవగాహన**

**తిరుపతిలో గంజాయి, మాదక ద్రవ్యాలకు చోటు లేదు: ఎస్పిఎల్.సుబ్బారాయుడు**

తిరుపతి (సింధూరదర్శిని) 17 ఏప్రిల్ తిరుపతి జిల్లా; జిల్లాలో పట్టుబడిన సుమారు 4,100 కేజీల గంజాయిని కోర్టు అనుమతి తో డిస్ పోజ్ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం రేణిగుంట మండలం తుక్కివాకం వద్ద ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మరియు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ల సమక్షంలో చట్టపరమైన విధానాల ద్వారా డిస్ పోజ్ చేయడం జరిగింది .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గంజాయి పండించడం, రవాణా, వినియోగం పై చాలా కఠినంగా వ్యవహరించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ఈగల్ సంస్థను ఏర్పాటు చేసి ఐజీ ర్యాంక్ అధికారిని నియమించి ప్రతి జిల్లాలో అనుబంధంగా అధికారులను ఏర్పాటు చేసి గంజాయి మరియు ఇతర డ్రగ్స్ మీద కఠినంగా వ్యవహరించడం జరుగుతున్నదన్నారు. తిరుపతి జిల్లాలో గడిచిన రెండు నుంచి మూడు సంవత్సరాల్లో సీజ్ అయినటువంటి గంజాయిని తూకివాకంలో ఇన్సినరేషన్ పద్ధతి ద్వారా డిస్పోజ్ చేస్తున్నామని, సుమారు 208 కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.20 కోట్ల విలువ గల 4,100 కేజీల గంజాయిని కోర్టు నుంచి అనుమతి తీసుకుని డిస్పోజ్ చేస్తున్నామన్నారు. దీని ద్వారా గంజాయి రవాణా, వినియోగించే వారికి గట్టి హెచ్చరిక పంపినట్లవుతుందన్నారు. తిరుపతి పట్టణం బెంగళూరు, చెన్నైకి ఒక ట్రాన్సిట్ పాయింట్‌గా గంజాయి రవాణాలో గుర్తించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాకు ఎక్కువగా ఏఎస్ఆర్ జిల్లా నుంచి వైజాగ్, కాకినాడ మీదుగా బస్సుల్లో, ఇతర ప్రైవేట్ వాహనాల్లో తిరుపతికి వచ్చి, ఇక్కడి నుంచి చెన్నై, బెంగళూరు మరియు కేరళకు వెళ్లడం గమనించామన్నారు. వాటిని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సెర్చ్ పార్టీలను పెట్టి ట్రైన్స్, బస్సులు, లగేజీలను పరిశీలించి చేసి సీజ్ చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన గంజాయిని సీజ్ చేయడంతో పాటు లక్ష మంది స్కూల్ మరియు కాలేజ్ 8, 9, 10 మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులను ఒకే వేదికపైకి తెచ్చి, ఆన్లైన్ ద్వారా గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాల మీద అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఒక వైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మరో వైపు పిడి యాక్ట్ కింద కేసులు పెడుతూ గంజాయి వాడకాన్ని నియంత్రిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో సుమారు 15 పీడీ కేసులు (ప్రివెంటివ్ డిటెన్షన్) పెట్టడం జరిగిందన్నారు. గంజాయి మరియు ఇతర డ్రగ్స్ మీద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం, భవిష్యత్తులో ఎవరైనా గంజాయి రవాణా చేసినా, నిల్వ చేసినా, సహకరించినా లేదా వినియోగించినా వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ అందరికీ జిల్లాలో గత మూడు సంవత్సరాల నుండి సీజ్ చేసిన సుమారు 4 వేల కేజీల గంజాయి కోర్టు అనుమతితో డిస్పోజ్ చేస్తున్నామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం అరికట్టడంలో పోలీస్ శాఖ ఎటువంటి అలసత్వం వహించదు. ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా గంజాయి, మత్తు పదార్థాల వాడకం దుష్ప్రభావం, ఆరోగ్య సమస్యల ను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. పట్టుబడిన వారి పై పి డి యాక్ట్ కింద అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. వివిధ విద్యా సంస్థలు, ఎన్జీవోలు, పోలీస్ శాఖ ద్వారా అవగా హన కల్పిస్తామన్నారు. తిరుపతి ఒక ఆధ్యాత్మిక నగరం, ఎటువంటి గంజాయికి స్థానం లేదని ఆ దిశగా ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పని చేయడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ప్రజల్లో మరింత పూర్తిగా అవగాహన కల్పించి, లీగల్ ప్రొసీజర్ ప్రకారం వెళ్తూ గజాయిని పూర్తిగా రూపుమాపడానికి చర్యలు చేపడతామన్నారు. భవిష్యత్తులో గంజాయి, మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలు, మీడియా అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పిలు, డిఎస్పిలు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# మహిళా చట్టాలపై అవగాహన

గూడూరు( సింధూర దర్శిని) 17 ఏప్రిల్ నెల్లూరు జిల్లా ; పట్టణంలోని సొసైటీ వద్ద గల రోటరీ క్లబ్ నందు మహిళలు మరియు బాలికల సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా శక్తి యాప్ గురించి మరియు ఇటీవల డిజిపి ప్రవేశపెట్టిన ఆపరేషన్ చిన్నారి తల్లి గురించి మరియు ఒక దేశ అభివృద్ధికి మహిళలు, బాలికల యొక్క రక్షణ అనేది ఎంత ముఖ్యమో తెలపడం జరిగినది. మహిళలు మరియు బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేయబడిన చట్టాల గురించి వారికి తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మోహన్, డిప్యూటీ తాసిల్దారు, ఎస్సై మనోజ్‌కుమార్, సిడిపిఓ షేక్. మెహబూబీ మరియు సూపర్వైజర్లు, మెప్మా కి సంబంధించిన అధికారులు, పీహెచ్సీ డాక్టర్ రేష్మ , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు... మరో స్టాండప్ కమెడియన్ అరెస్ట్

- -పవన్ కల్యాణ్‌పై వివాదాస్పద వ్యాఖ్యల కలకలం
- -మరో స్టాండప్ కమెడియన్ రఫీక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
- -బెయిల్‌పై విడుదలైన కమెడియన్ అనుదీప్ కటికాల
- -వ్యక్తిగత విమర్శల వెనుక రాజకీయ కుట్ర ఉందన్న అనుమానాలు

అమరావతి, సింధూరదర్శిని:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలకు దిగిన ఇద్దరు స్టాండప్ కమెడియన్లపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అనుదీప్ కటికల అనే కమెడియన్‌ను అరెస్ట్ చేయగా, తాజాగా విశాఖపట్నంకు చెందిన మరో కమెడియన్ రఫీక్ మొహమ్మద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హాస్యం పేరుతో సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ ఘటనలు తీవ్ర చర్చకు దారితీశాయి. గత కొంతకాలంగా పవన్ వైవాహిక జీవితం, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా కొందరు సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్‌తో పాటు రామ్ చరణ్, ఉపాసన, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనుదీప్ కటికలను కాకినాడ పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరువక ముందే రఫీక్ మొహమ్మద్ అనే కమెడియన్ గతంలో చేసిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. పవన్ ముగ్గురు భార్యల గురించి, ముఖ్యంగా ఆయన భార్య అన్నా లెజినోవా గురించి రఫీక్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. ఈ వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని జనసేన నేత సాయన శివనారాయణ మచిలీపట్నంలోని చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం రాత్రి విశాఖపట్నంలోని రఫీక్ నివాసానికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పుడు కేవలం సినీ నటుడు మాత్రమే కాదు, రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కీలక హోదాలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే రాజకీయ ప్రత్యర్థుల ప్రోద్బలంతోనే ఈ కమెడియన్లు వరుసగా దాడులకు దిగుతున్నారని కూటమి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు.

# విదేశీ విద్యకు అపోలో వేదిక

### యూకే యూనివర్సిటీతో స్ప్రింగ్ వీక్ విజయవంతం

చిత్తూరు సింధూరదర్శిని:విద్యార్థుల్లో అంతర్జాతీయ విద్య, గ్లోబల్ కెరీర్ అవకాశాలపై అవగాహన పెంపొందించేం దుకు ది అపోలో యూనివర్సిటీ 2+1 బీఈంగ్ కంప్యూ టర్ సైన్స్‌కు సంబంధించి నిర్వహించిన “స్ప్రింగ్ వీక్ 2026” కార్యక్రమం విజయ వంతమైంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ భాగస్వామ్యం తో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు విదేశీ విద్యా విధానం, అకాడమిక్ అవకాశాలు, కెరీర్ మార్గదర్శనం, యూకే సంస్కృతి పై సమగ్ర అవగాహన కల్పించింది. యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ నుంచి వచ్చిన నిపుణులు విద్యార్థులతో ప్రత్య క్షంగా మమేకమై గ్లోబల్ ఎడ్యుకేషన్ వ్యవస్థ, కోర్సుల నిర్మాణం, అంతర్జాతీయ అవకాశాలపై వివరించారు. ప్రారంభంలో యూనివర్సిటీ నాయకత్వం, అంతర్జాతీయ ప్రతినిధుల మధ్య సమావేశం నిర్వహించి 2ం1 అంతర్జాతీయ విద్యా విధానం ప్రాముఖ్యతను వివరిం చారు. ఈ విధానం ద్వారా విద్యార్థులు ప్రారంభ దశ నుంచే విదేశీ ఫ్యాకల్టీతో పరిచయం పెంపొంది ంచుకుని, భవిష్యత్ చదువులకు సన్నద్ధమవుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్‌కు చెందిన నిపుణులు రాయ్ క్రోల్ (అసోసియేట్ ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ మ్యాథమేటికల్ సైన్సెస్), మ్యాక్సిన్ బోడికోట్-బ్రూక్స్ (కెరీర్స్ అండ్ ఎంప్లాయబిలిటీ లీడ్), ఫ్రాన్సిస్ డోన్బెసూర్ (అసోసియేట్ ప్రొఫెసర్, ఎంటర్‌ప్రెన్యూర్షిప్), రీకో హెకెల్ (ప్రొఫెసర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్) అకాడమిక్ సపోర్ట్, స్టూడెంట్ కేర్ అంశాలతో పాటు కంప్యూటర్ సైన్స్‌కు సంబంధిం చిన ఆధునిక విషయాలపై టేస్టర్ లెక్చర్లు నిర్వహించారు.

హాస్కెల్ ప్రోగ్రామింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మోడలింగ్ వంటి అంశాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా యూకేలో ఉద్యోగ అవకాశాలు, అప్లికేషన్ ప్రక్రియ, కెరీర్ ప్లానింగ్‌పై నిపుణులు మార్గదర్శనం చేశారు. విద్యార్థులు తమ కెరీర్ లక్ష్యాలపై స్పష్టత పొందడంతో పాటు, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు అవసరమైన నైపుణ్యాలను అవగాహన చేసుకున్నారు. విద్యార్థులు, ఫ్యాకల్టీ మధ్య జరిగిన ఇంటరాక్షన్ సెషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యూకే విద్యా విధానం, క్యాంపస్ జీవితం, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు నిపుణులతో నేరుగా చర్చించారు. చివరగా యూకే సంస్కృతి, జీవన విధానం పై నిర్వహించిన సెషన్లు విద్యార్థులకి అంతర్జాతీయ అనుభవాన్ని అందించాయి ది అపోలో యూనివర్సిటీ నాయకత్వం, వీసీ డా. హెచ్. వినోద్ భట్ సమక్షంలో యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ ప్రతినిధులతో ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఈంగ్ కంప్యూటర్ సైన్స్ 2ం1 అంతర్జాతీయ విద్యా పథకం ప్రాముఖ్యతను వివరించారు. ఈ పథకం ద్వారా విద్యార్థులు ప్రారంభ దశ నుంచే అంతర్జాతీయ ఫ్యాకల్టీతో పరిచయం పెంపొందించుకుని, యూకేలో ఉన్నత విద్యకు సన్నద్ధమవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. టి. వివేకానందన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్, యూనివర్సిటీ ఫ్యాకల్టీ సభ్యులు సమన్వయం చేశారు. స్ప్రింగ్ వీక్ 2026 విజయవంతంగా ముగియడంతో విద్యార్థులు గ్లోబల్ అకాడమిక్, కెరీర్ అవకాశాలకు మరింత సిద్ధమయ్యారు.

# తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా?: జగన్‌పై గౌతుశిరీష ఫైర్

-మహిళా రిజర్వేషన్ బిల్లుపై వైసీపీ నేతల విమర్శలు హాస్యాస్పదమన్న గౌతు శిరీష -

-ఆస్తి కోసం తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన జగన్ మహిళా పక్షపాతి కాదని విమర్శలు -

-వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డిని జగన్ ప్రభుత్వం కాపాడిందని ఆరోపణ -

-అమరావతి మహిళలను వేధించిన చరిత్ర వైసీపీది అంటూ ఆగ్రహం -



అమరావతి, సింధూరదర్శిని: వైసీపీ నేతలు ఇప్పటివరకు విలన్లు అనుకుంటే, ఇప్పుడు వారు చేస్తున్న విమర్శలతో ఉత్త జోకర్లుగా నిరూపించుకుంటున్నారని టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతుంటే, ఏపీలోని వైసీపీ నేతలు మాత్రం విషం చిమ్ముతున్నారని ఆమె మండిపడ్డారు. తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా? అంటూ జగన్ పై ధ్వజమెత్తారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జగన్ పాలనలో మహిళలపై అనేక అకృత్యాలు జరిగాయంటూ నిప్పులు చెరిగారు. "మాజీ మంత్రి విడుదల రజిని గారు టీడీపీ వస్తే అకృత్యాలు జరుగుతాయని అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఒక్కసారి గూగుల్ ఓపెన్ చేసి 2023 ఎన్సీఆర్‌బీ నివేదిక చూడండి. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో నేరాలు ఏ స్థాయిలో పెరిగాయో ఆ నివేదిక చెంపదెబ్బ కొట్టినట్లు చెబుతోంది. దక్షిణాదిలో మనకంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడును వెనక్కి నెట్టి ఏపీని నేరాల్లో నంబర్ వన్ చేసిన ఘనత మీ జగన్ రెడ్డిది కాదా?" అని శిరీష ప్రశ్నించారు. దళితులపై అఘాయిత్యాల్లో కూడా రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, మీ హయాంలో జరిగిన నేరాల చిట్టా చూస్తే ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ఆమె నిలదీశారు. చంద్రబాబు పాలనకు, జగన్ గందరగోళ పాలనకు నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉందని శిరీష అన్నారు. "ఎన్టీఆర్ గారు ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పిస్తే, చంద్రబాబు గారు డ్వాక్రా సంఘాలతో కోటి మంది మహిళలకు ఆర్థిక సాధికారత ఇచ్చారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చి మహిళలను మహారాణులను చేశారు. కానీ, జగన్ రెడ్డి పాలనలో ఏం జరిగింది? అమరావతికి భూములిచ్చిన ఆడబిడ్డలను నడిరోడ్డుపై ఈడ్చి, వారిపై డ్రోన్లు తిప్పి వేధించిన క్రూరమైన చరిత్ర మీది. సొంత తల్లికి, చెల్లికి గౌరవం ఇవ్వని జగన్ రెడ్డి, రాష్ట్ర మహిళలకు మేలు చేశామని చెప్పుకోవడం ఈ శతాబ్దపు అతిపెద్ద జోక్" అని ఆమె విమర్శించారు. వైసీపీ సోషల్ మీడియా సైకోలు టీడీపీ, జనసేన వీరమహిళలపై పెట్టిన అశ్లీల పోస్టుల ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని, తాను కూడా బాధితురాలినేనని శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. "జగనన్న వదిలిన బాణం అని పాదయాత్ర చేసిన చెల్లి షర్మిలపైనే నీచమైన పోస్టులు పెట్టిస్తున్నారు. ఆస్తిలో వాటా అడిగినందుకు కన్నతల్లిని బయటకు గెంటేసిన చరిత్ర జగన్‌ది. సొంత బాబాయ్ వివేకానంద రెడ్డిని చంపిన వారిని శిక్షించాలని పోరాడుతున్న ఆయన కూతురు సునీత రెడ్డిపై సాక్షి పత్రికలో రాయిస్తున్న రాతలు ఎంత అసహ్యంగా ఉన్నాయో ప్రజలు గమనిస్తున్నారు. ఇంతటి దమనకాండ సాగించి, ఈరోజు మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు" అని శిరీష సవాల్ విసిరారు. జగన్ హయాంలో జరిగిన దారుణాలను ఆమె పేరుపేరునా ప్రస్తావించారు. 'జై జగన్' అనలేదని చంద్రయ్యను గొంతు కోసి చంపడం, మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపడం, తన సోదరిని ఏడిపించారని అడిగిన పదేళ్ల బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం వంటి రాక్షస పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ముగ్గురు మహిళలకు కీలక శాఖలు ఇచ్చి చంద్రబాబు మహిళా పక్షపాతి అని నిరూపించుకున్నారని, వైసీపీ నేతలు ఇప్పటికైనా అబద్ధాలు ఆపి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని గౌతు శిరీష డిమాండ్ చేశారు.

## రూ.2 లక్షల లంచం.. ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎక్సైజ్ సీఐ

కామారెడ్డి జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎక్సైజ్ సీఐ

రూ.2 లక్షలు తీసుకుంటుండగా

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

కల్లు దుకాణం తరలింపునకు లంచం డిమాండ్

చేసిన సీఐ సత్యనారాయణ

సీఐని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన అధికారులు



కామారెడ్డి, సింధూరదర్శిని: జిల్లాలో ఓ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న దీను సత్యనారాయణ రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఓ వ్యక్తి తన కల్లు దుకాణాన్ని మరో గ్రామానికి మార్చుకోవడానికి అనుమతి కోరాడు. అదే సమయంలో తనపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశాడు. ఈ పని చేసిపెట్టడానికి సీఐ సత్యనారాయణ బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బిచ్కుందలోని సీఐ అద్దె ఇంట్లో బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఐ వద్ద అదనంగా లభించిన రూ.45,670 నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసి, హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

## పాస్టర్ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు

రూ. 2.27 కోట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో

ఓ చర్చి పాస్టర్ ఇంట్లో భారీ నగదు పట్టివేత

సోదాల్లో ఎలాంటి ఆధారాలు లేని రూ. 2.27 కోట్లను

స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఇది హవాలాకు సంబంధించిన డబ్బుగా

అనుమానిస్తున్న అధికారులు

హైదరాబాద్ నుంచి అల్లుడు డబ్బు తేవడంతో

నిఘా పెట్టి పట్టుకున్న పోలీసులు

డబ్బు ఎక్కడిదో చెప్పలేక తడబడిన పాస్టర్ కుటుంబం



పశ్చిమ గోదావరి, సింధూరదర్శిని: జిల్లాలో ఓ చర్చి పాస్టర్ ఇంట్లో భారీగా నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. నరసాపురం మండలం పీచుపాలెంకు చెందిన పాస్టర్ ఘంటా జాన్‌బాబూరావు నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించి, ఎలాంటి ఆధారాలు లేని రూ. 2.27 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ డబ్బును సీజ్ చేసి, ఆదాయపు పన్ను (ఐటీ) శాఖకు సమాచారం అందించారు. ఇటీవల పాస్టర్ అల్లుడు శాంసన్ హైదరాబాద్ నుంచి రూ. 50 లక్షల నగదు తీసుకురావడంతో పోలీసులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన మామగారైన జాన్‌బాబూరావు ఇంట్లో తనిఖీలు చేపట్టగా, రూ. 500 నోట్ల కట్టల రూపంలో దాచి ఉంచిన ఈ భారీ మొత్తం బయటపడింది. ఇది హవాలా లావాదేవీలకు సంబంధించిన డబ్బు అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక పాస్టర్ ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో బాబూరావు కుటుంబం పెద్ద ఎత్తున ఆస్తులు కొనుగోలు చేసినట్లు, లక్షల్లో ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పట్టుబడిన డబ్బు గురించి పోలీసులు ప్రశ్నించగా, కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ డబ్బు మూలాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## సుకేశ్ కేసులో కీలక మలుపు..
### అప్రూవర్‌గా మారతానన్న నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్

సుకేశ్ చంద్రశేఖర్ మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం

అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమంటూ కోర్టుకు తెలిపిన నటి జాక్వెలిన్

ముందుగా ఈడీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించిన ఢిల్లీ కోర్టు

గతంలో జాక్వెలిన్‌పై కేసు కొట్టివేతకు సుప్రీంకోర్టు నిరాకరణ

రూ.7 కోట్లకు పైగా బహుమతులు స్వీకరించారని జాక్వెలిన్‌పై ఈడీ ఆరోపణలు



సింధూరదర్శిని:ఆర్థిక మోసగాడు సుకేశ్ చంద్రశేఖర్‌కు సంబంధించిన రూ.215 కోట్ల మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తాను అప్రూవర్‌గా మారేందుకు సిద్ధంగా ఉన్నానని బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఇటీవల ఢిల్లీ కోర్టుకు తెలిపారు. దీంతో ఈ కేసు ఊహించని మలుపు తీసుకుంది. జాక్వెలిన్ అభ్యర్థనపై స్పందించిన న్యాయస్థానం, ఈ విషయంలో ముందుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని ఆమెకు సూచించింది. నిబంధనల ప్రకారం జాక్వెలిన్ అప్రూవర్‌గా మారాలనుకుంటే మొదట దర్యాప్తు సంస్థ అయిన ఈడీకి అభ్యర్థన పంపాల్సి ఉంటుంది. ఈడీ అధికారులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని, దానిని పరిశీలించిన తర్వాతే ఆమెను అప్రూవర్‌గా మార్చాలా? వద్దా? అనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటారు. అప్పుడు కోర్టులో ప్రత్యేకంగా ఒక అప్లికేషన్ దాఖలు చేస్తారు. ఈప్రక్రియ పూర్తయితేనే జాక్వెలిన్ అప్రూవర్‌గా మారే అవకాశం ఉంటుంది. గతేడాది సెప్టెంబర్‌లో తనపై నమోదైన మనీలాండరింగ్ కేసును కొట్టివేయాలని కోరుతూ జాక్వెలిన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఆమె అప్రూవర్‌గా మారేందుకు ముందుకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సుకేశ్ నేర చరిత్ర గురించి తనకు తెలియదని, తానూ అతని చేతిలో మోసపోయానని జాక్వెలిన్ మొదటి నుంచి వాదిస్తున్నారు. సుకేశ్ తనను తాను ఒక ప్రముఖ వ్యాపారవేత్తగా పరిచయం చేసుకుని తప్పుదోవ పట్టించాడని ఆమె కోర్టులో పేర్కొన్నారు. అయితే, ఈడీ మాత్రం జాక్వెలిన్‌ను ఈ కేసులో సహ నిందితురాలిగా పేర్కొంటూ 2022 ఆగస్టులోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. సుకేశ్ ఒక నేరస్థుడని తెలిసి కూడా అతని నుంచి రూ.7 కోట్లకు పైగా విలువైన ఆభరణాలు, కార్లు, ఖరీదైన వస్తువులను బహుమతులుగా స్వీకరించారని ఈడీ ఆరోపిస్తోంది. సుకేశ్ అరెస్ట్ అయిన తర్వాత జాక్వెలిన్ తన ఫోన్‌లోని డేటాను తొలగించారని, మొదట్లో ఆర్థిక లావాదేవీల వివరాలను దాచిపెట్టి, ఆధారాలు చూపించాక అంగీకరించారని దర్యాప్తు సంస్థ తన ఛార్జ్‌షీట్‌లో స్పష్టంగా పేర్కొంది. ప్రస్తుతం పలు కేసుల్లో సుకేశ్ చంద్రశేఖర్ జైలులో ఉన్నాడు. అతను జాక్వెలిన్‌ను తన ప్రేయసిగా చెప్పుకుంటూ జైలు నుంచి ప్రత్యేక సందర్భాల్లో లేఖలు రాయడం తెలిసిందే. వీరిద్దరూ సన్నిహితంగా ఉన్న ఫొటోలు బయటకు వచ్చినప్పటికీ, జాక్వెలిన్ మాత్రం తాను మోసపోయినట్లు చెబుతున్నారు. తాజా పరిణామంతో ఈ కేసు ఎలాంటి మలుపులు తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## డీలిమిటేషన్‌తో అన్యాయం జరిగితే ఊరుకోం

లోక్‌సభలో మిథున్ రెడ్డి

ప్రత్యేక హోదా అంశాన్ని లోక్‌సభలో

గుర్తు చేసిన మిథున్ రెడ్డి

హోదా ఇస్తామని చెప్పి.. ఆ తర్వాత చట్టంలో లేదని

తప్పించుకున్నారని విమర్శ

డీలిమిటేషన్ విషయంలో అదే పునరావృతమైతే

సహించేది లేదని హెచ్చరిక



సింధూరదర్శిని: నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై పార్లమెంట్ సాక్షిగా వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. గతంలో విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేకహోదా' ఇస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో లేదంటూ తప్పించుకున్నారంటూ మండిపడ్డారు. ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో కూడా అదే తీరు పునరావృతమైతే సహించేది లేదని ఆయన తెగేసి చెప్పారు. డీలిమిటేషన్ అనేది దేశ నిర్మాణానికి ఉపయోగపడాలి తప్ప, ప్రతిపక్షాలను అణగదొక్కే సాధనంగా మారకూడదని ఆయన హితవు పలికారు. ముఖ్యంగా ఏపీలో లోక్‌సభ స్థానాల విషయంలో ఒక్క సీటు తగ్గినా, లేదా రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగేలా ఏ చిన్న అన్యాయం జరిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి సైతం ఇదే అంశంపై స్పందిస్తూ.. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య సీట్ల కేటాయింపులో సమానత్వం ఉండాలని, అప్పుడే డీలిమిటేషన్‌కు అసలైన సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. సీట్ల పంపకాల్లో తేడాలు వస్తే పోరాటం తప్పదని పార్టీ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించేలా ఈ ప్రక్రియ ఉండకూడదన్నదే వైసీపీ ప్రధాన డిమాండ్‌గా కనిపిస్తోంది.

## దుబాయ్‌లో ఎయిర్ ట్యాక్సీలు... తొలి స్టేషన్ నిర్మాణం




అందుబాటులోకి రానున్న

ఎయిర్ ట్యాక్సీ సేవలు

ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టడమే ప్రధాన ఉద్దేశం

45 నిమిషాల ప్రయాణం ఇకపై 10 నిమిషాల్లోనే..!

సింధూరదర్శిని:నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి, ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించే దిశగా దుబాయ్ ప్రభుత్వం తన ప్రతిష్ఠాత్మక 'ఎయిర్ ట్యాక్సీ' ప్రాజెక్టును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొట్టమొదటి ఎయిర్ ట్యాక్సీ స్టేషన్ (వర్టిపోర్ట్) నిర్మాణం పూర్తిచేసింది. ఈ విషయాన్ని దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ప్రకటించారు. 3,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఎయిర్ ట్యాక్సీ స్టేషన్‌లో ఏటా 1,70,000 మంది ప్రయాణించడానికి వీలుగా సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ స్టేషన్ ఈ ఏడాది చివరికి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం దుబాయ్ విమానాశ్రయం నుంచి పామ్ జుమేరాకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే రద్దీని బట్టి సుమారు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతుంది. అయితే, ఈ ఎయిర్ ట్యాక్సీల ద్వారా కేవలం 10 నుంచి 12 నిమిషాల్లోనే గమ్యాన్ని చేరుకోవచ్చు. 2026 చివరి నాటికి ఈ సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొదటి దశలో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం, డౌన్‌టౌన్ దుబాయ్, దుబాయ్ మెరీనా, పామ్ జుమేరా వంటి నాలుగు కీలక ప్రాంతాల్లో ఈ వర్టిపోర్టులను నిర్మించనున్నారు. ఈ ఎయిర్ ట్యాక్సీలు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలు. హెలికాప్టర్ల తరహాలో నిలువుగా గాల్లోకి లేచి, నిలువుగా ల్యాండ్ అవుతాయి. వీటికి రన్‌వే అవసరం లేకపోవడంతో పాటు, తక్కువ శబ్దం చేస్తూ పర్యావరణహితంగా పనిచేస్తాయి.

ఈ ఫ్లయింగ్ ట్యాక్సీల రాకతో పర్యాటకులు, వ్యాపారవేత్తలు విమానాశ్రయం నుంచి నేరుగా తమ గమ్యస్థానాలకు ట్రాఫిక్ చిక్కులు లేకుండా వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు.

# అక్షయ తృతీయకు బంగారం కొనాలా?.. ఫోన్‌పేలో చాలా సులభం!

**అక్షయ తృతీయ సందర్భంగా ఫోన్‌పేలో డిజిటల్ గోల్డ్ - 99.99% స్వచ్ఛతతో 24 క్యారెట్ల బంగారం కొనుగోలు చేసే వెసులుబాటు**

**సిప్ విధానంలో, లేదా రూ.10 నుంచే కొనే సౌకర్యం - యూపీఐ, కార్డుల ద్వారా సులభంగా చెల్లింపులు**

**కొన్న బంగారాన్ని ఎప్పుడైనా అమ్మి, నగదు పొందే వీలు**

హిందువులు ఎంతో పవిత్రంగా భావించే అక్షయ తృతీయ పర్వదినం సమీపిస్తోంది. ఈ పవిత్రమైన రోజున బంగారం కొనుగోలు చేస్తే సిరిసంపదలు వృద్ధి చెందుతాయని చాలా మంది నమ్ముతారు. ఈ సంప్రదాయాన్ని మరింత సులభతరం చేస్తూ, ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే తన వినియోగదారుల కోసం డిజిటల్ గోల్డ్ కొనుగోలు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. సురక్షితమైన, పారదర్శకమైన విధానంలో వినియోగదారులు తమకు నచ్చినంత బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు.




ఫోన్‌పే ప్లాట్‌ఫామ్‌లో 99.99 శాతం స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ల బంగారాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇందుకోసం MMTC-PAMP, సేఫ్‌గోల్డ్, క్యారెట్‌లేన్ వంటి విశ్వసనీయ సంస్థలతో ఫోన్‌పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీంతో వినియోగదారులు ఎలాంటి సందేహాలు లేకుండా స్వచ్ఛమైన బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. కేవలం ఒక్కసారే కాకుండా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (SIP) విధానంలో రోజూ లేదా నెలవారీగా కొద్దికొద్దిగా బంగారం కొనుగోలు చేసి దీర్ఘకాలికంగా ఆదా చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. కనీసం రూ.10 నుంచే బంగారం కొనుగోలు చేసే సౌకర్యం ఉండటం దీనిలోని మరో ప్రత్యేకత. చెల్లింపుల కోసం యూపీఐ, యూపీఐ లైట్, క్రెడిట్/డెబిట్ కార్డులు, వ్యాలెట్, గిఫ్ట్ కార్డులు వంటి బహుళ మార్గాలను ఉపయోగించుకోవచ్చు. వినియోగదారులు తాము కొనుగోలు చేసిన డిజిటల్ బంగారాన్ని ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా అమ్ముకోవచ్చు. అమ్మిన వెంటనే సంబంధిత నగదు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులు ఫోన్‌పే ద్వారా స్వచ్ఛమైన బంగారాన్ని కొనుగోలు చేస్తూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.

**ఫోన్‌పేలో బంగారం ఇలా కొనండి..**

ముందుగా మీ ఫోన్‌లోని ఫోన్‌పే యాప్‌ను ఓపెన్ చేయాలి.

హోమ్ స్క్రీన్‌పై కిందికి స్క్రోల్ చేస్తే 'Gold & Silver' విభాగం కనిపిస్తుంది. అక్కడ 'వీశీతీవ' ఆప్షన్‌పై ట్యాప్ చేయాలి.

తరువాత 'Buy Gold' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

మీరు ఎంత మొత్తానికి బంగారం కొనాలనుకుంటున్నారో ఎంటర్ చేసి, Proceedపై క్లిక్ చేయాలి.

స్క్రీన్‌పై 5 నిమిషాల టైమర్ ముగిసేలోపు 'Proceed to Pay' బటన్‌ను నొక్కాలి.

చివరగా మీకు అనువైన చెల్లింపు విధానాన్ని ఎంచుకుని, పేమెంట్ పూర్తి చేయాలి.

అంతే.. డిజిటల్ బంగారం మీ ఖాతాలో జమ అవుతుంది.

# చెఫ్ వికాస్ ఖన్నా: 'టైమ్ 100' జాబితాలో స్థానం వెనుక కన్నీటి ప్రయాణం!

**ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నాకు 'టైమ్ 100' జాబితాలో చోటు - ఈ స్థాయికి చేరడానికి ఆయన పడిన కష్టాలు ఎన్నో**

**భారత్‌లో వ్యాపారం కూలిపోవడంతో అమెరికాకు పయనం - న్యూయార్క్‌లో వీధుల్లో ఆహారం అమ్మి, రైల్వే స్టేషన్‌లో నిద్రించిన వైనం**

**ఆయన ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని ఫ్యాన్స్ ప్రశంసలు**

ప్రపంచ ప్రఖ్యాత చెఫ్ వికాస్ ఖన్నా తన జీవితంలో మరొక అద్భుతమైన మైలురాయిని అందుకున్నారు. 2026 సంవత్సరానికి గానూ 'టైమ్' మ్యాగజైన్ ప్రకటించిన ప్రపంచంలోని 100 మంది అత్యంత ప్రభావశీలుర జాబితాలో ఆయన చోటు దక్కించుకున్నారు. ఈ వార్త తెలియగానే న్యూయార్క్‌లోని 'బంగ్లో' రెస్టారెంట్‌కు అభినందనల వెల్లువ మొదలైంది. అయితే, ఈ విజయం వెనుక తాను పడిన కఠోర శ్రమను, అవమానాలను, ఒంటరితనాన్ని గుర్తుచేసుకుంటూ చెఫ్ వికాస్ ఖన్నా తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఒక సుదీర్ఘమైన, భావోద్వేగమైన పోస్ట్ చేశారు.



**అమృత్‌సర్ వీధుల నుంచి..**

తన ప్రయాణం 1989లో అమృత్‌సర్‌లోని ఒక స్కూల్ వద్ద ఛోలే బటూరే అమ్ముకోవడంతో మొదలైందని వికాస్ ఖన్నా తెలిపారు. 1990లో తన ఇంటి వెనుక భాగంలోనే 'లారెన్స్ గార్డెన్ బాంక్వెట్' ప్రారంభించారు. అయితే, 1991లో తాను చెఫ్ కావాలని నిర్ణయించుకున్నప్పుడు తన నానమ్మ తప్ప కుటుంబంలో దాదాపు అందరూ ఆ నిర్ణయాన్ని అవమానంగా భావించారని ఆయన గుర్తుచేసుకున్నారు."నేను ఎప్పుడూ చెప్పని ఎన్నో అవమానాలు, నన్ను మానసికంగా కుంగదీసిన క్షణాలు నా జీవితంలో ఉన్నాయి. 2000వ సంవత్సరంలో నా బాంక్వెట్ హాల్‌ను కూల్చివేసినప్పుడు, ఇక అంతా అయిపోయిందని దాదాపుగా ఓటమిని అంగీకరించాను. కానీ, బదులుగా అమెరికాకు వెళ్లి మళ్లీ కొత్తగా జీవితం ప్రారంభించాను" అని ఆయన వివరించారు.

**న్యూయార్క్‌లో కఠిన పరీక్షలు**

అమెరికా ప్రయాణం ఆయనకు పూలబాట కాలేదు. న్యూయార్క్‌లో మళ్లీ సున్నా నుంచి తన ప్రయాణం మొదలుపెట్టారు. ఇళ్లు శుభ్రం చేయడం, ట్రైబెకా వీధుల్లో ఆహారం అమ్మడం, గ్రాండ్ సెంట్రల్ స్టేషన్‌లో నిద్రించడం, నిరాశ్రయుల కేంద్రంలో తలదాచుకోవడం వంటి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. "రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు నన్ను 'కర్రీ బాయ్' అని పిలిచేవారు. అయినా నేను ముందుకు సాగుతూనే ఉన్నాను" అని తన ఆవేదనను పంచుకున్నారు.

**విజయం, పతనం, పునరాగమనం**

ఈ కఠోర శ్రమకు ఫలితంగా ఆయన 8 మిషెలిన్ స్టార్స్‌ను అందుకున్నారు. కానీ, ఆ తర్వాత మళ్లీ తనను తాను కోల్పోయానని, తిరిగి తన సోదరికి ఇచ్చిన మాట కోసం 'బంగ్లో' రెస్టారెంట్‌తో చివరిసారిగా మళ్లీ ప్రారంభించానని తెలిపారు. ఇప్పుడు టైమ్ 100 జాబితాలో చోటు దక్కించుకోవడంపై స్పందిస్తూ, "ఈ గౌరవాన్ని నేను ఇంకా జీర్ణించుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. ప్రయాణం ఇంకా కొనసాగుతుంది" అని వినమ్రంగా పేర్కొన్నారు. ఆయన పోస్ట్‌కు అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. "మీ ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. మిమ్మల్ని మీరు నమ్మండి, ఆశ కోల్పోవద్దు అనే సందేశాన్ని ఇచ్చారు" అని ఒకరు కామెంట్ చేయగా, "మీ వినయం, సంస్కృతి మిమ్మల్ని ప్రత్యేకంగా మార్చాయి. మీ బయోపిక్ తీయాలి" అని మరొకరు సూచించారు. ఈ ఏడాది టైమ్ జాబితాలో భారత్ నుంచి వికాస్ ఖన్నాతో పాటు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, నటుడు రణబీర్ కపూర్ కూడా స్థానం సంపాదించుకున్నారు.

# ఇండోనేషియా అడవుల్లో కుప్పకూలిన హెలికాప్టర్..

**8 మంది దుర్మరణం**

**టేకాఫ్ అయిన 5 నిమిషాలకే తెగిపోయిన కాంటాక్ట్**

**దట్టమైన అటవీ ప్రాంతంలో శకలాల గుర్తింపు**

**మృతుల్లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు**



సింధూరదర్శిని: ఇండోనేషియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. వెస్ట్ కాలిమంతన్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది మృతి చెందారు. దట్టమైన అటవీ ప్రాంతంలోని కొండల మధ్య హెలికాప్టర్ శకలాలను అధికారులు గుర్తించారు. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం మెలావీలోని ఒక ప్లాంటేషన్ ఏరియా నుంచి టేకాఫ్ అయిన కేవలం ఐదు నిమిషాలకే ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అనంతరం గాలింపు చర్యలు చేపట్టగా, గురువారం మధ్యాహ్నం 3:25 గంటల సమయంలో ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన సూపర్ ప్యూమా హెలికాప్టర్ మొదట శకలాలను గుర్తించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. సహాయక బృందాలు ఇప్పటివరకు నాలుగు మృతదేహాలను వెలికితీశాయి. మరో మూడు మృతదేహాలు శకలాల్లోనే చిక్కుకోగా, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోంది. చీకటి పడటం, భూభాగం అత్యంత కఠినంగా ఉండటంతో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేశారు. శుక్రవారం ఉదయం తిరిగి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. రాయిటర్స్ నివేదిక ప్రకారం ఈ హెలికాప్టర్ మాథ్యూ ఎయిర్ నుసంతారాకు చెందినది. చిత్ర మహకోట అనే పామాయిల్ కంపెనీకి చెందిన ప్లాంటేషన్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది.

## ఇండియా గేమింగ్ షో 6వ ఎడిషన్‌లో రాష్ట్ర మంత్రి మండిపల్లి రామప్రసాద్

**ఇండియా గేమింగ్ షో రిబ్బన్ కటింగ్ చేసిన ప్రారంభించిన మంత్రి.**

**ఎగ్జిబిషన్‌ను సందర్శించిన మంత్రి**

**ప్రపంచస్థాయి గేమింగ్ హబ్‌గా భారత్ ఎదగాలి**

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



చెన్నై:చెన్నై ట్రేడ్‌సెంటర్‌లో CII, IDGS ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా గేమింగ్ షో 6వ ఎడిషన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డి పాల్గొని రిబ్బన్‌కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గేమింగ్, ఈ-స్పోర్ట్స్ పరిశ్రమకు సంబంధించిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ఆధునిక సాంకేతికతలు, కొత్త ట్రెండ్స్‌పై ఆసక్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో దేశ విదేశాల ప్రతినిధులతో కలిసి పాల్గొని ప్రసంగిస్తూ, గేమింగ్ రంగం యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నదని, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో IDGS అధ్యక్షులు రాజన్ నవానీ, వైస్ ప్రెసిడెంట్ సీన్‌సోన్‌ను మంత్రి అభినందించారు. అలాగే IDGS సెక్రటేరియట్ సభ్యులు సుభాష్ సర్పు, మధురిమ మణియర సపాల్గొన్నారు.గేమింగ్ రంగ అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు మరింత దోహదం చేస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# చిన్న గెలాక్సీలలోనూ బ్లాక్ హోల్స్.. భారత శాస్త్రవేత్తల పరిశోధనలో కొత్త కోణం

**పాలపుంత చుట్టూ ఉన్న చిన్న గెలాక్సీలలో బ్లాక్ హోల్స్ ఉండొచ్చని భారత శాస్త్రవేత్తల అధ్యయనం వెల్లడి**

**ఈ పరిశోధన చేపట్టిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ శాస్త్రవేత్తలు**

**ఈ పరిశోధన భవిష్యత్ టెలిస్కోపుల ద్వారా చేసే అధ్యయనాలకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుందని వ్యాఖ్య**



విశ్వంలో అతిపెద్ద గెలాక్సీల కేంద్రాల్లోనే కాకుండా అతి చిన్న గెలాక్సీలలోనూ కృష్ణబిలాలు (బ్లాక్ హోల్స్) ఉండే అవకాశం ఉందని భారత శాస్త్రవేత్తల తాజా అధ్యయనం వెల్లడించింది. మన పాలపుంత గెలాక్సీ చుట్టూ పరిభ్రమించే మరుగుజ్జు గోళాకార గెలాక్సీలలో మధ్యస్థ పరిమాణ కృష్ణబిలాలు ఉండేందుకు బలమైన ఆధారాలు ఉన్నాయని తమ డేటా సూచిస్తోందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వివరాలను సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)కు చెందిన కె. ఆదిత్య, అరుణ్ మంగళం ఈ కీలక అధ్యయనం చేపట్టారు. వీరు నక్షత్రాలు, డార్క్ మ్యాటర్ హేలో, కేంద్రంలోని కృష్ణబిలం అనే మూడు గురుత్వాకర్షణ భాగాలతో కూడిన డైనమిక్ మోడళ్లను రూపొందించారు. అత్యంత నాణ్యమైన స్టెల్లార్ కైనమాటిక్ డేటాను ఉపయోగించి, ఈ గెలాక్సీలలో నక్షత్రాలు ఎలా కదులుతున్నాయో విశ్లేషించారు. ఒకవేళ ఆ గెలాక్సీల కేంద్రంలో కృష్ణబిలం ఉంటే, దాని ద్రవ్యరాశిని అంచనా వేయడానికి ఈ సమాచారాన్ని ఉపయోగించారు.

ఈ పరిశోధనపై అరుణ్ మంగళం మాట్లాడుతూ.. "మా మోడళ్లు, డేటాను పరిశీలించినప్పుడు ఈ మరుగుజ్జు గెలాక్సీలలోని కేంద్ర కృష్ణబిలాల ద్రవ్యరాశిపై కచ్చితమైన పరిమితులు విధించగలిగాం. సాధారణంగా వీటి ద్రవ్యరాశి పది లక్షల సౌర ద్రవ్యరాశుల కంటే తక్కువగా ఉంటుంది. కొన్ని గెలాక్సీలలో ఇంకా తక్కువ విలువలు ఉండే అవకాశం ఉంది. ఈ గెలాక్సీలలో కచ్చితంగా భారీ కృష్ణబిలాలు ఉండాలని మా డేటా చెప్పడం లేదు. కానీ, మధ్యస్థ పరిమాణ కృష్ణబిలాలు ఉండేందుకు మాత్రం మా డేటా పూర్తిగా అనుకూలంగా ఉంది" అని వివరించారు. పెద్ద గెలాక్సీల కేంద్రాలలో సూపర్‌మాసివ్ కృష్ణబిలాలను గుర్తించడం సాధారణమే. కానీ, పాలపుంత చుట్టూ ఉండే మరుగుజ్జు గెలాక్సీలు చాలా కాంతిహీనంగా, వాయువులు లేకుండా, డార్క్ మ్యాటర్‌తో నిండి ఉంటాయి. దీంతో వీటిలో కృష్ణబిలాలను నేరుగా గుర్తించడం అత్యంత కష్టతరం. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం గెలాక్సీలు, కృష్ణబిలాల పరిణామ సిద్ధాంతాలకు, భవిష్యత్ పరిశీలనలకు చాలా ముఖ్యమైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భవిష్యత్తులో ఐఐఏ ప్రతిపాదించిన నేషనల్ లార్జ్ ఆప్టికల్ టెలిస్కోప్ (చీూు), ఎక్స్‌ట్రీమ్లీ లార్జ్ టెలిస్కోప్ (జుూు) వంటి అత్యాధునిక పరిశీలనా సౌకర్యాలు రాబోతున్నాయి. ఇవి అతి తక్కువ కాంతివంతమైన, చిన్న గెలాక్సీలలోని నక్షత్ర కదలికలను కూడా కచ్చితంగా కొలవగలవు. అలాంటి పరిస్థితుల్లో ఈ అధ్యయనంలో ప్రతిపాదించిన ఏకీకృత సంబంధం ఆ డేటాను విశ్లేషించడానికి ఒక బలమైన ఫ్రేమ్ వర్క్‌గా ఉపయోగపడుతుందని అరుణ్ మంగళం తెలిపారు.




# శ్రేయస్ క్యాచ్‌కు సచిన్ ఫిదా.. అద్భుతమంటూ కితాబు

**పంజాబ్-ఎంఐ మ్యాచ్ లో శ్రేయస్ అయ్యర్ అద్భుత క్యాచ్ సచిన్ టెండూల్కర్ ప్రశంసలు**

**అది కేవలం అథ్లెటిజం కాదు, దాని వెనుక అద్భుతమైన అవగాహన అని వ్యాఖ్య**

**బౌండరీ లైన్ వద్ద గాల్లోనే బంతిని అందుకుని సహచరుడికి అందించడంపై కితాబు**

**తాను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఇదొకటని కొనియాడిన సచిన్**

గత రాత్రి ముంబై ఇండియన్స్ తో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పట్టిన ఓ అద్భుతమైన క్యాచ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆ క్యాచ్‌ను, తాను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఒకటిగా అభివర్ణించాడు. కేవలం అథ్లెటిజం మాత్రమే కాదని, దాని వెనుక అద్భుతమైన అవగాహన, సమయస్ఫూర్తి ఉన్నాయని సచిన్ ప్రత్యేకంగా విశ్లేషించాడు. శ్రేయస్ అయ్యర్ క్యాచ్ గురించి సచిన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ... "బంతి వేగాన్ని, ఎత్తును అంచనా వేయడం, బౌండరీ లైన్ ఎక్కడుందో గమనించుకోవడం, దాన్ని తొక్కకుండా సరైన సమయంలో గాల్లోకి లేవడం.. ఇవన్నీ అద్భుతం. అంతటితో ఆగకుండా, గాల్లో ఉండగానే బంతిని పట్టుకుని, కిందపడేలోపు తన సహచర ఫీల్డర్‌కు అందించాడు. ఆ సమయంలో తన టీమ్‌మేట్ ఎక్కడున్నాడో కూడా కచ్చితంగా తెలిసి ఉండాలి. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది" అని వివరించారు. ఇలాంటి ఫీట్ చేయాలంటే నమ్మశక్యంకాని అవగాహన, టైమింగ్, ఫిట్‌నెస్, సంయమనం అవసరమని సచిన్ తెలిపారు. "శ్రేయస్ అయ్యర్ అన్నింటినీ కచ్చితంగా అంచనా వేశాడు. నేను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఇది కచ్చితంగా ఒకటి" అని సచిన్ కొనియాడారు.

# అంతర్జాతీయ పరిణామాలతో మార్కెట్ల జోరు... లాభాల్లో ముగిసిన సూచీలు

**అమెరికా-ఇరాన్ చర్చల నేపథ్యంలో ఇన్వెస్టర్లలో ఆశావహ దృక్పథం**

**FMCG షేర్ల అండతో దూసుకెళ్లిన సూచీలు**


**ప్రధాన సూచీలను మించి రాణించిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్**

**నష్టాలతో ముగిసిన ఐటీ రంగం షేర్లు**

వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య జరగనున్న చర్చలపై ఇన్వెస్టర్లు ఆశావహ దృక్పథంతో ఉండటంతో భారత ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో కొనుగోళ్ల వైపు మొగ్గు చూపారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 504.86 పాయింట్లు లాభపడి 78,493.54 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156.80 పాయింట్లు పెరిగి 24,353.55 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వంటి షేర్లు రాణించి మార్కెట్లకు మద్దతునిచ్చాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్‌ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా సూచీలు మంచి లాభాలు సాధించగా, ఐటీ రంగం షేర్లు మాత్రం నష్టాలతో ముగిశాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్ 1.27 శాతం, స్మాల్‌క్యాప్ 1.48 శాతం మేర లాభపడి మెరుగైన పనితీరు కనబరిచాయి.

ఇరాన్‌తో వివాదాన్ని త్వరలోనే ముగించాలని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం, లెబనాన్-ఇజ్రాయెల్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం వంటి పరిణామాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే చర్చలకు వస్తామన్న ఇరాన్ షరతుకు ఇది అనుకూలంగా మారింది.

"ఇటీవలి ఒడిదొడుకుల తర్వాత మార్కెట్ ఇప్పుడు స్థిరత్వ దశలోకి వస్తున్నట్లు కనిపిస్తోంది. నిఫ్టీకి తక్షణ అవరోధంగా 24,410 స్థాయి ఉంది. దీనిని దాటితే 24,700 వరకు వెళ్లే అవకాశం ఉంది. మార్కెట్ దిగివచ్చిన ప్రతిసారీ కొనుగోలు చేయడం మంచి వ్యూహం. 24,000 స్థాయి వద్ద నిఫ్టీకి బలమైన మద్దతు ఉంది," అని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. వారాంతంలో జరగబోయే అమెరికా-ఇరాన్ చర్చల ఫలితాలు మార్కెట్ తదుపరి గమనాన్ని నిర్దేశిస్తాయని వారు అంచనా వేస్తున్నారు.



# టీ20 వరల్డ్ కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం.. కెనడా కెప్టెన్‌పై ఐసీసీ విచారణ!

**కెనడా, న్యూజిలాండ్ మ్యాచ్‌లో ఫిక్సింగ్ జరిగిందని ఆరోపణలు - కెనడా కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా వేసిన ఓవర్‌పై ఐసీసీ ఏసీయూ విచారణ**

**ఒక డాక్యుమెంటరీ ద్వారా ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చిన వైనం - కెనడా క్రికెట్ బోర్డుపై మరికొన్ని అవినీతి ఆరోపణలపైనా దర్యాప్తు**





క్రికెట్ ప్రపంచాన్ని మ్యాచ్ ఫిక్సింగ్ భూతం మరోసారి వణికిస్తోంది. తాజాగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. కెనడా, న్యూజిలాండ్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా కెనడా జట్టు ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించిందని, దీనిపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ విచారణ ప్రారంభించిందని ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో తన కథనంలో వెల్లడించింది. కెనడాకు చెందిన 'ది ఫిఫ్త్ ఎస్టేట్' అనే ఇన్వెస్టిగేటివ్ ప్రోగ్రామ్.. 'కరప్షన్, క్రైమ్ అండ్ క్రికెట్' పేరుతో రూపొందించిన ఒక డాక్యుమెంటరీ ఈ సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీలో చెన్నై వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌లో కెనడా జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేసిన ఒక ఓవర్‌పై ప్రధానంగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 173 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బౌలింగ్‌కు దిగిన కెనడా పేసర్లు తొలి రెండు ఓవర్లలో 35 పరుగులు ఇచ్చారు. మూడో ఓవర్ వేసిన స్పిన్నర్ సాద్ బిన్ జాఫర్ వికెట్ తీసి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మెయిడెన్ ఓవర్ పూర్తి చేశాడు. ఇలాంటి కీలక సమయంలో ఐదో ఓవర్ వేయడానికి కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా స్వయంగా బంతిని అందుకున్నాడు. ఆ ఓవర్లో ఒక నో-బాల్, రెండు వైడ్లతో సహా ఏకంగా 15 పరుగులు సమర్పించుకున్నాడు. ఉద్దేశపూర్వకంగానే ఆ ఓవర్లో భారీగా పరుగులు ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ. కేవలం ఈ ఒక్క ఆరోపణే కాకుండా కెనడా క్రికెట్ బోర్డుపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) మరికొన్ని విచారణలు కూడా జరుపుతోంది. జాతీయ జట్టులో కొందరు ఆటగాళ్లను ఎంపిక చేయాలని కోచ్ ఖుర్రం చౌహాన్, బోర్డు సభ్యులు ఒత్తిడి చేసినట్లుగా ఉన్న ఒక ఫోన్ కాల్ ఆడియో గతంలో లీక్ అయింది. దీనిపైనా ఏసీయూ దర్యాప్తు చేస్తోంది. ఈ ఆరోపణలపై ఐసీసీ ఇంటిగ్రిటీ యూనిట్ జనరల్ మేనేజర్ ఆండ్రూ ఎఫ్‌గ్రేవ్ స్పందించారు. ఈ డాక్యుమెంటరీ విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే విచారణ దశలో ఉన్న అంశాలపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ఐసీసీ నిబంధనల ప్రకారం దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. ఈ ఆరోపణలతో కెనడా క్రికెట్ బోర్డుతో పాటు టీ20 ప్రపంచకప్ పారదర్శకతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# సెలబ్రిటీల మెరుపు మీ సొంతం.. గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు

**సెలబ్రిటీల లాంటి మెరిసే చర్మం కోసం నిపుణుల చిట్కాలు - సూర్యరశ్మి నుంచి చర్మాన్ని కాపాడే ఎస్పీఎఫ్ వాడకం తప్పనిసరి**

**ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, తగిన నిద్ర చాలా ముఖ్యం - రెటినాల్, హైల్యూరోనిక్ యాసిడ్ వాడకంతో మెరుగైన ఫలితాలు**

**మద్యపానం తగ్గించడం చర్మ సౌందర్యానికి ఎంతో అవసరం**



సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు. ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.

**నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:**

**ఎస్పీఎఫ్ తప్పనిసరి:**

చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (SPF) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (స్రాఫ్) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం.

**తేమ (మాయిశ్చర్) కీలకం:**

చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది.

**ఆహారం, వ్యాయామం:**

ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది.

**యాక్టివ్ ఇంగ్రీడియంట్స్:**

చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి. ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.

# నాసిక్ టీసీఎస్‌లో బలవంతపు మతమార్పిడి.. తీవ్రంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం

**టీసీఎస్ లైంగిక వేధింపులు, మత మార్పిడి ఆరోపణలపై తొలిసారి సీఎం స్పందన**

**దీని వెనుక పెద్ద ముఠా ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా వెల్లడైందన్న సీఎం**

**సంస్థలో జరిగిన ఘటనను గుర్తించిందంటూ టీసీఎస్‌పై ప్రశంస**

**టీసీఎస్ యాజమాన్యం పోలీసుల దర్యాప్తుకు సహకరిస్తోందని వెల్లడి**




నాసిక్‌లోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) యూనిట్‌లో జరిగిన లైంగిక వేధింపులు, బలవంతపు మత మార్పిడి ఆరోపణలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తొలిసారిగా స్పందించారు. ఈ ఘటన 'కార్పొరేట్ జిహాద్' చర్య అని తేలితే, దాని మూలాలను గుర్తించేందుకు దర్యాప్తు సంస్థలను రంగంలోకి దింపుతామని హెచ్చరించారు. ఈ ఘటన అత్యంత తీవ్రమైనదని, దీని వెనుక పెద్ద ముఠా ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా వెల్లడైందని అన్నారు. సంస్థలో జరిగిన ఈ ఘటనను గుర్తించినందుకు ఆయన టీసీఎస్‌ను అభినందించారు. కంపెనీ యాజమాన్యం కూడా ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిందని, పోలీసులకు దర్యాప్తులో సహకరిస్తోందని తెలిపారు.

ఈ ఘటనకు మూల కారణాలు తెలుసుకోవడానికి పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారని తెలిపారు. ఈ ఘటనకు కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టబోమని హెచ్చరించారు. పోలీసులు ఇప్పటి వరకు ఎనిమిది మందిని అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారని అన్నారు.

**బాధితురాలు పలుమార్లు ఫిర్యాదు చేసింది: నాసిక్ పోలీస్ కమిషనర్**

ఈ ఘటనకు సంబంధించి నాసిక్ పోలీస్ కమిషనర్ సందీప్ కార్నిక్ మాట్లాడుతూ, బాధితురాలు తన సమస్యపై పలుమార్లు హెచ్‌ఆర్ విభాగానికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని అన్నారు. పైగా పని ప్రదేశాల్లో ఇలాంటివి సహజమని చెప్పి ఆమెను పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. నిందితులకు అతివాద భావజాల గ్రూపులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.


# సినిమా న్యూస్



రోజ్ సర్దానా యొక్క మనోహరమైన చీర పోజు వైరల్ అవుతోంది. మృదువైన సహజ కాంతి మరియు సొగసైన చీర కట్టు ఆమె సాంప్రదాయ-ఆధునిక సమ్మేళన రూపానికి ఒక నూతన, యవ్వనపు ఆకర్షణను జోడించాయి.

## డెస్టినీ అంటే ఇదే..సత్యదేవ్ గ్రేట్ అచీవ్‌మెంట్!

కొంత మంది ఎక్కడ పోగొట్టుకున్నారో అక్కడే రాబట్టుకుంటారు.. అదే డెస్టినీ అంటే. ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. అలాంటి అరుదైన సంఘటనే హీరో, టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ విషయంలోనూ జరిగిందట. అదే విషయాన్ని ఈ సందర్భంగా వెల్లడించి అందరిని షాక్‌కు గురి చేశాడు. సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మూవీ -రావ్ బహదూర్-. వెంకటేష్ మహా దర్శకుడు. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై హీరో మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీపా థామస్ హీరోయిన్‌గా నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్న ఈ మూవీ ఫస్ట్ సింగిల్‌ని ఇటీవల విడుదల చేశారు. సినిమా రిలీజ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో తాజా నిర్వహించిన ప్రమోషనల్ ఈవెంట్‌లో హీరో సత్యదేవ్ ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించి ఆశ్చర్యపరిచారు. అంతే కాకుండా మహేష్ బాబుపై తనకున్న అభిమానానని ఈ సందర్భంగా చాటుకు న్నాడు. ఓ అరుదైన సంఘటనని ఈ సందర్బంగా వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎస్.ఆర్. నగర్ ఎక్కువగా కాలేజీలు ఉండే ఏరియాలో ఓ సినిమా షూటింగ్ కోసం ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నాం. ఆ సన్నివేశాన్ని మహేష్ బాబు, నేను పాల్గొనగా చిత్రీరిస్తు న్నారు. దీంతో చుట్టు పక్కల ట్రాఫిక్ జామ్ అయింది. స్టూడెంట్స్ ఎగ్జామ్స్ జరుగు తున్నా ఎగ్జామ్స్‌కు వెళ్లడం లేదు. అక్కడే ఉండి షూటింగ్ చూస్తున్నారు. కొంత మంది కిటికీల్లోంచి చూస్తూ కేకలు వేస్తున్నారు. ఆ సమయంలో మహేష్ నా భుజంపై చేయి వేసి డైలాగ్‌లు చెబుతున్నారు. ఇంతలో మా షూటింగ్ కార ణంగా ట్రాఫిక్ జామ్ అయిం దని తెలిసి ఓ పోలీస్ ఆయన వచ్చి షూటింగ్‌ని వాయిదా వేసుకోమన్నాడు. దాంతో నాకు సంబంధించిన వెర్షన్ పూర్తి కాకుండానే షూటింగ్ ఆగిపోయింది. దాంతో నా సీన్‌ని సినిమాలోంచి లేపేశారు. అప్పటికే ఊళ్లో వాళ్లందరికి నేను మహేష్ బాబుతో కలిసి నటించానని చెప్పుకున్నాను. సినిమాలో లేకపోయే సరికి ఫీలయ్యాను. అయితే



అలా మిస్సయిన అవకాశం మళ్లీ ఈ సినిమాతో నన్ను వెతుక్కుంటూ రావడం డెస్టినీ అన్నారు సత్యదేవ్. మహేష్‌తో నటించిన సీన్ కట్ అయినా ఆయనే నా సినిమాకు సమర్పకులుగా వ్యవహరించడంతో నా డ్రీమ్ ఫుల్ ఫిల్ అయిందన్నారు. ఈ విషయం పక్కన పెడితే ప్రస్తుతం మహేష్ బాబు అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న -వారణాసి-లో నటిస్తున్నారు. జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న గ్లోబల్ మూవీగా అత్యంత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇరాన్ - ఇజ్రాయెల్ వార్ కారణంగా ఈ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతూ వస్తోంది. సౌదీ, దుబాయ్‌లలో కీలక సన్నివేశాలని షూట్ చేయాలని ప్లాన్ చేశారట. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆ షెడ్యూల్‌ని ఇండియాలోనే భారీ సెట్‌లలో పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.

## సమంత కెరీర్ గ్రాఫ్..గ్యాప్!

ఏ మాయ చేసావే అంటూ అడుగుపెట్టిన సమంత అనతి కాలంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగారు. కెరీర్ ఆరంభంలో అమ్మడి ప్రయాణం ఒక ప్రభంజనంలా సాగింది. మహేష్ , పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలందరి సరసన నటించి గోల్డెన్ లెగ్ గా పేరు తెచ్చుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ వరుస విజయాలు సాధిస్తూ సౌత్ ఇండియాలోనే అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయికలలో ఒకరిగా సత్తా చాటారు. ఆ సమయంలో ఆమె కెరీర్ గ్రాఫ్ నిరంతరం ఎదుగుతూనే ఉంది. అయితే వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు సమంత వృత్తిపరమైన వేగాన్ని ప్రభావితం చేసాయి అన్నది కాదనలేని నిజం.



## ‘తిమ్మరాజుపల్లి టీవీ’ మూవీ రివ్యూ

‘తిమ్మరాజుపల్లి టీవీ’ మూవీ రివ్యూ నటీనటులు: సాయితేజ్- వేద జలంధర్- ప్రదీప్ కొట్టె- స్వాతి కరిమిరెడ్డి - అమ్మ రమేష్- సత్యనారాయణ- లతీష్ తదితరులు సంగీతం: వంశీకాంత్ రేఖన ఛాయాగ్రహణం: అక్షయ్ రామ్ పొడిశెట్టి నిర్మాత: కిరణ్ అబ్బవరం రచన-దర్శకత్వం: మునిరాజు హీరోగా తనకంటూ మంచి గుర్తింపు సంపాదించుకున్న కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు నిర్మాత అవతారం ఎత్తాడు. అందరూ కొత్త వాళ్లను పెట్టి అతను నిర్మించిన సినిమా.. తిమ్మరాజుపల్లి టీవీ. ఇంట్రెస్టింగ్ టీజర్..ట్రైలర్లతో ఆకట్టుకున్న ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి సినిమా కూడా అంతే ఆసక్తికరంగా ఉందా? చూద్దాం పదండి. కథ: 90వ దశకంలో అప్పుడే కొత్తగా పల్లెటూళ్లకు టీవీలు వస్తున్న రోజుల్లో చిత్తూరు జిల్లాలోని తిమ్మరాజుపల్లె అనే ఊరిలో నడిచే కథ ఇది. చదువు మధ్యలో ఆపేసి చిన్న చిన్న దొంగతనాలు చేసుకుంటూ బతికే సతీష్ (సాయితేజ్).. శారద (వేద జలంధర్)ను ప్రేమిస్తాడు. ఆమె కూడా అతణ్ని ఇష్టపడుతుంది. ఒకసారి టౌన్ నుంచి టీవీ అద్దెకు తెచ్చి ఊర్లో జనాలకు సినిమాలు చూపించడంతో.. వాళ్లందరికీ టీవీ పిచ్చి పట్టుకుంటుంది. అదే సమయంలో శారద అన్న రాజప్ప తన ఇంటికి కొని తెస్తాడు. తనే ఊరికి తొలి టీవీ తీసుకురావాలని అనుకున్న ఆ ఊరి పెద్దకు అది గిట్టదు. మరోవైపు తన చెల్లెల్ని సతీష్ ప్రేమిస్తున్న సంగతి తెలిసి అతడికి వార్నింగ్ ఇస్తాడు రాజప్ప. ఈ గొడవ జరిగిన తర్వాతి రోజే రాజప్ప ఇంట్లో టీవీ మాయం అవుతుంది. సతీష్ చేసిన పాత దొంగతనాలు.. రాజప్పతో అతడికి జరిగిన గొడవను బట్టి అతనే టీవీ దొంగిలించాడని ఊరి జనం తన మీద అభియోగం మోపుతారు. రెండు వారాల్లో టీవీ తెచ్చివ్వకపోతే తనకు శిక్ష వేయాలని నిర్ణయిస్తారు. మరోవైపు శారద కూడా తనకు దూరమయ్యే పరిస్థితి రావడంతో ఎలాగైనా ఆ టీవీ దొంగను పట్టి తేవాలని సతీష్ పంతం పడతాడు. మరి అతడి ప్రయత్నం ఫలించిందా.. ఇంతకీ ఆ టీవీ దొంగ ఎవరు.. చివరికి సతీష్-శారద కలిశారా లేదా అన్నది మిగతా కథ. కథనం-విశ్లేషణ: ఏదైనా వస్తువు మనకు అంత సులువుగా దక్కని పరిస్థితి ఉంటే.. అది అందినపుడు కలిగే భావోద్వేగమే వేరుగా ఉంటుంది. 90వ దశకం.. అంతకంటే ముందు వరకు మధ్యతరగతి అంతకంటే దిగువన ఉన్న కుటుంబాలకు టీవీ అన్నది అలాంటి అపురూపమైన వస్తువే. అప్పట్లో టీవీల్లో వచ్చే సినిమాలు.. కార్యక్రమాలు చూసినపుడు కలిగిన ఆనందం గురించి ముందు తరం వాళ్లను అడిగితే కథలు కథలుగా చెబుతారు. ఆ తరం వాళ్లు సొంతంగా టీవీ కొనుక్కున్నపుడు కలిగిన ఉద్వేగం కూడా వేరు. అప్పటి ఓ పల్లెటూరిలో టీవీ చుట్టూ తిరిగే ఒక కథ ద్వారా డ్రామా పండించాలని చూశాడు ‘తిమ్మరాజుపల్లి టీవీ’ దర్శకుడు మునిరాజు. ఆ తరం వాళ్లకు కచ్చితంగా ఇదొక నోస్టాల్జియా లాగే అనిపిస్తుంది. ఆ రోజులు ఇలా ఉండేవా అనుకుని ఈ తరం ప్రేక్షకులు ఈ సినిమా చూస్తూ ఒకింత ఆశ్చర్యపోవచ్చు. టైటిల్ కు తగ్గట్లు పూర్తిగా టీవీ చుట్టూ కథను అల్లుకున్న తీరు.. అప్పటి పల్లెటూరి వాతావరణాన్ని చూపించిన తీరు.. సహజంగా ఈ కథను నడిపించిన వైనం బాగున్నాయి కానీ.. ఈ కథ పరిధి మరీ చిన్నదైపోయిన ఫీలింగ్ కలుగుతుంది. రెండు గంటల నిడివికి సరిపోయేంత విస్తృతి ఈ కథలో లేదనిపిస్తుంది. విడివిడిగా సన్నివేశాలు బాగున్నా.. ఓవరాల్ గా డ్రామా కూడా అనుకున్నంతగా పండలేదు. ‘తిమ్మరాజుపల్లి టీవీ’లో హీరో హీరోయిన్ల కంటే కూడా హైలైట్ అయింది టీవీనే. ఒక రకంగా చెప్పాలంటే ఈ సినిమాలో లీడ్ రోల్ టీవీదే. ఇప్పుడు 40 అంతకంటే ఎక్కువ వయసున్న వాళ్లకు టీవీలతో ఉన్న తొలి అనుభవాలన్నీ ఈ చిత్రంలో చూడొచ్చు. ముఖ్యంగా పల్లెటూళ్లలో ఆ రోజుల్లో టీవీని ఎంత అపురూపంగా చూసేవారో గమ్మత్తుగా ఈ సినిమాలో చూపించాడు దర్శకుడు. టౌన్ నుంచి టీవీ- సినిమా క్యాసెట్లు రెంటుకు తెచ్చి పల్లెటూళ్లలో ప్రదర్శిస్తే అదొక జాతరను తలపించేది. కొత్తగా ఎవ్వరి ఇంటికి అయినా టీవీ వస్తే ఊర్లో వాళ్లంతా అక్కడికి వచ్చి ఎలా హడావుడి చేసేవారో... టీవీ చూడ్డం కోసమే గంటల తరబడి ఆ ఇళ్లలో ఎలా తిష్ట వేసేవారో.. టీవీ ఉన్న వాళ్ల గర్వం




ఎలా ఉండేదో చాలా బాగా చూపించారు. ఐతే కేవలం ఇలాంటి నోస్టాల్జిక్ మూమెంట్స్ చూపిస్తూ పోతే సరిపోదు కదా? అంతకుమించి ఏదో ఒక కథ చెప్పాలి. ఊరిలో ఉన్న ఒక్క టీవీ దొంగతనానికి గురి కావడం.. ఆ నింద హీరో మీద పడడం.. అతడి అతడి అస్తిత్వాన్నే దెబ్బ తీసే పరిస్థితి రావడం.. తన ప్రేమకు కూడా శాపంగా మారడం.. ఇలా డ్రామా రక్తికట్టేలా కథను బాగానే అల్లుకున్నారు. కానీ తెర మీద ఈ క్రమాన్ని అనుకున్నంత ఆసక్తికరంగా చూపించలేదు. హీరో హీరోయిన్ల పాత్రలను సరిగా తీర్చిదిద్దకపోవడం.. వారి మధ్య ప్రేమకథను కూడా తేల్చిపడేయడంతో వాటితో ఎమోషనల్ కనెక్ట్ ఏర్పడదు. ప్రతి పాత్రా ఒక్కోసారి ఒక్కోరకంగా ప్రవర్తిస్తుంటుంది. ఏదీ బలమైన ఇంపాక్ట్ వేయదు. క్యారెక్టర్లలో ఒక కంటిన్యుటీ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. మొదట్లో కొన్ని నోస్టాల్జిక్ మూమెంట్స్ తర్వాత కథ పక్కదారి పట్టేసింది. టీవీ దొంగతనానికి గురి అయ్యే సన్నివేశం దగ్గర మళ్లీ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించగలిగాడు దర్శకుడు. ఐతే ఇంటర్వెల్ దగ్గర హీరోలు వీర లెవెల్లో ఛాలెంజులు విసరడం.. ఆ వెంటనే ఆ ఇంటెన్సిటీని కొనసాగించకుండా మామూలుగా కనిపించడం చాలా సినిమాల్లో కనిపించే సమస్యే. ఇందులోనూ అదే జరుగుతుంది. సమస్య వచ్చినపుడు ఎంతో పౌరుషం చూపిస్తూ.. సవాళ్లు చేసే హీరో.. ఆ వెంటనే చప్పబడిపోతాడు. కొంత సమయం వరకు అచేతనంగా ఉండిపోతాడు. అందుకు తగ్గట్లే కథనం కూడా నత్తనడకన సాగుతుంది. ఐతే చివరి అరగంటలో ‘తిమ్మరాజుపల్లి టీవీ’ కొంచెం ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తుంది. అసలు టీవీ దొంగిలించింది ఎవరనే విషయంలో సస్పెన్స్ బాగానే మెయింటైన్ చేశారు. చివరికి ఇచ్చిన ట్విస్ట్ ఆశ్చర్యపరుస్తుంది. అదే సమయంలో మిశ్రమానుభూతిని కలిగిస్తుంది. కానీ ‘టీవీ’లో ఉన్న ప్రతికూల కోణాన్ని హైలైట్ చేస్తూ పతాక సన్నివేశాలను ముగించడం బాగుంది. ఓవరాల్ గా చెప్పాలంటే ‘తిమ్మరాజుపల్లి టీవీ’ కొంచెం భిన్నమైన ప్రయత్నమే. కాన్సెప్ట్ బాగుంది కానీ.. కథాకథనాల్లో ఇంకొంచెం వెయిట్ ఉండాల్సిందనిపిస్తుంది. ఇది మరీ ప్రత్యేకమైన అనుభూతిని కలిగించదు. అలా అని తీసిపడేయదగ్గ సినిమా కాదు. నటీనటులు: ‘తిమ్మరాజుపల్లి టీవీ’లో తెలిసిన ముఖం ఒక్కటీ కనిపించదు. హీరో హీరోయిన్ల దగ్గర్నుంచి అందరూ కొత్త వాళ్లు.. లేదంటే పెద్దగా ప్రాధాన్యం లేని పాత్రలు చేసిన చిన్న నటుడు. కానీ వాళ్లందరూ కూడా ఎక్కడా తడబడకుండా తమ పాత్రలకు తగ్గట్లు సహజంగా నటించడం ‘తిమ్మరాజుపల్లి టీవీ’ ప్రత్యేకత. హీరో పాత్రలో సాయితేజ్ చాలా బాగా నటించాడు. కొన్ని సన్నివేశాల్లో అతను చూపించిన ఇంటెన్సిటీ ఆకట్టుకుంటుంది. హీరోయిన్ పాత్రకు వేద జలంధర్ సరిపోయింది. పల్లెటూరి అమ్మాయిగా సులువుగా ఒదిగిపోయింది. రాజప్ప పాత్రలో చేసిన నటుడి హావభావాలు బాగున్నాయి. కానీ ఆ పాత్ర నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తాం. అతడికి జోడీగా చేసిన అమ్మాయి.. తండ్రి పాత్రలో కనిపించిన నటుడు.. ఊరి పెద్ద పాత్రలో చేసిన యాక్టర్ కూడా మెప్పించారు. ఆర్టిస్టుల్లో ఎవరికీ వంకలు పెట్టడానికి వీల్లేదు. అందరూ కథకు.. పాత్రలకు తగ్గట్లుగా పెర్ఫామ్ చేశారు. సాంకేతిక వర్గం: ఈ సినిమాకు రియల్ హీరో సంగీత దర్శకుడు వంశీకాంత్. సినిమాలో చాలా సాధారణంగా అనిపించే సన్నివేశాల్లో కూడా ఏదో జరిగిపోతున్న ఫీలింగ్ కలిగించి జనాలు ఉత్కంఠగా తెర వైపు చూసేలా చేశాడతను. వంశీకాంత్ బీజీఎం అంత ఎఫెక్టివ్ గా సాగింది. స్కోర్ వరకు ఆరంభం నుంచి చివరి వరకు ఎక్కడా టెంపో తగ్గకుండా చూశాడతను. పాటలు కూడా బాగానే అనిపిస్తాయి. అక్షయ్ రామ్ ఛాయాగ్రహణం కూడా బాగుంది. 90ల నాటి పల్లెటూరి వాతావరణాన్ని చాలా బాగా చూపించాడు. ఆర్ట్ వర్క్ కూడా ఓకే. ఇలాంటి కథకు సపోర్ట్ చేయడం ద్వారా కిరణ్ అబ్బవరం తన అభిరుచిని చాటుకున్నాడు. ఇంతమంది కొత్త వాళ్లను పరిచయం చేసినందుకు అతను అభినందనీయుడు. మునిరాజు రచయితగా-దర్శకుడిగా కొంతమేర ఆకట్టుకున్నాడు. అతను ఎంచుకున్న కాన్సెప్ట్ బాగుంది. కానీ ఎగ్జిక్యూషన్లో కొంత తడబడ్డాడు. పాత్రల చిత్రణ ఇంకా బాగా ఉండుంటే.. కథనాన్ని మరింత బిగితో రాసుకుని ఉంటే ‘తిమ్మరాజుపల్లి టీవీ’ ఇంపాక్ట్ వేరుగా ఉండేది. చివరగా: తిమ్మరాజుపల్లి టీవీ.. బొమ్మ పర్వాలేదు రేటింగ్- 2.5/5

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662